

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 29 | సంచిక : 11 | జూలై 2024


ఈ సంచికలో. . . .


గురువే దైవం ........................................ 2

వ్యాసం వందే జగద్గురుం ........................... 8


సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు..... 11

గురువు అంటే ఆత్మ ............................... 34

నిజమైన భక్తులు ................................. 35

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

ఎవరైతే నీకు లోచూపు కలగచేస్తున్నాడో, ఎవరైతే నీకు లోదృష్టి కలగజేస్తున్నాడో, ఎవరైతే నీకు హృదయంలో ఆ దివ్యదృష్టిని ప్రసాదించాడో వాడే నీకు గురువు.


రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 36

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రు|| 150/-

విడి ప్రతి : రు|| 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప||గో|| జిల్లా, ఆం||ప్ర||

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

# గురువే దైవం

అరుణాచలా, శ్రీరమణ రూపా, శ్రీనాన్న గురుదేవా! గురు పరంపరలో, మన ప్రత్యక్ష గురువులైన ప్రేమస్వరూపులు శ్రీ నాన్నగారు 'గురువు' యొక్క విశిష్టతని అనేక సందర్భాలలో మన హృదయాలకు హత్తుకునేలా బోధించారు. అంతేకాక, తన జీవిత విధానంలో గురువు యొక్క వైభావాన్ని మనకి ప్రత్యక్షంగా చూపించారు. గురువు యొక్క అంతస్తు, ఆ వైభవం, మనకి గురువే చెప్పాలి. గురుపూర్ణిమ సందర్భంగా, శ్రీ నాన్నగారు గురువు గురించి చెప్పిన కొన్ని మాటలు.

**గురువే దైవం**

సర్వాంతర్యామి అయిన భగవంతుడు అంతటా వ్యాపించి ఉన్నాడు, లోపల ఉన్నాడు, బయట ఉన్నాడు. మనకి ఉన్న చదువు వల్ల కాని, ధనం వల్ల కాని, తెలివితేటలకి కాని భగవంతుడు స్వాధీనం అవ్వడు. మనకి ఉన్న ప్రేమ వల్లే, మన భక్తి వల్లే భగవంతుడు కట్టుబడతాడు. అనేక జన్మలు భగవంతుడిని ఆరాధించగా ఆరాధించగా, మీ ప్రేమకి కరిగి, మీ భక్తికి కరిగి, సర్వాంతర్యామి అయిన భగవంతుడే గురువుగా వ్యక్తమవుతాడు. గురువు అంటే త్రిమూర్తి స్వరూపం. మనకి గురువే బ్రహ్మదేవుడు గురువే విష్ణువు గురువే శివుడు. ఆ దేవుడే గురు రూపం ధరించి వస్తాడు.

గురువు మన అజ్ఞానాన్ని తొలిగిస్తాడు, మన అహంభావనని బయటికి లాగి కాల్చి, ఏదైతే దేవుడు దేవుడు అనుకొంటున్నామో ఆ స్వరూపానికి చేర్చుతాడు. మనలోని చీకటిని తొలిగించి, మనకి గమ్యం ఏదో తెలియక పోయినా గురువు లోపల ఉండి గమ్యం వైపుకి నడిపించి, మనని జన్మరాహిత్య స్థితికి తీసుకువెళతాడు. మనలో ఏమైనా చీకటికోణాలు ఉంటే ఆ చీకటి కోణాలు మన బుద్ధికి అందేలా చేసి, మన బుద్ధికి శక్తిని ఇచ్చి, ఆ చీకటి లోనుంచి విడుదల పొందటానికి తగిన బలాన్ని చేకూర్చుతాడు. గురువు మన క్షేమాన్ని మన శాంతిని కోరేవాడు, మనకి శాంతి ప్రదాత, మోక్ష ప్రదాత. అందుచేత, మీకు భగవంతుడు గురువు ఒకేసారి దర్శనం ఇస్తారు అనుకోండి, ముందు గురువుకే నమస్కారం పెట్టండి, తరువాత దేవుడికి పెట్టండి అని కబీరుదాసు చెప్పాడు.

రమణమహర్షి గారికి బాహ్యంగా గురువు లేకపోయినా, గురువు అవరసం లేదని ఎక్కడా చెప్పలేదు. భౌతికంగా ఆయనకి గురువు లేకపోవచ్చును, అరుణాచలేశ్వరుడే గురువు ఆయనకి, అరుణాచలేశ్వరుడే దైవం. మనలో మంచి గుణాలు కలగచేసేవాడు, మనకి మంచి ప్రవృత్తి ప్రసాదించేవాడు, మనచేత సత్కర్మ చేయించేవాడు గురువు. మనకి మంచి సంకల్పాలు తీసుకొచ్చి, ఆ మంచి సంకల్పాన్ని పోషించేవాడు గురువు, మంచి సంకల్పం రాకుండా, మనకేమైనా దుష్టసంకల్పాలు ఉంటే, దురాలోచనలు ఉంటే, వాటిని తొలిగించేవాడు గురువు. అంతా గురువే! ఈ గురువు ఎక్కడ ఉన్నాడు అంటే, లోపలే ఆత్మగా ఉన్నాడు.

**చెరుకుగడ అంతా దేవుడు అయితే చెరుకుగడలో ఉన్న రసం గురువు!**

భగవంతుడిని జన్మల తరబడి ఆరాధించగా ఆరాధించగా, ఆ భగవంతుడిలో ఉన్న దయా గుణం, ఆ భగవంతుడిలో ఉన్న కృపే శరీరం ధరించి వస్తుంది, అదే గురువు అన్నారు రమణమహర్షి గారు. భగవంతుడు కర్మ ఫల దాత. ఇక్కడ, దేవుడికి శిక్షించే పని, రక్షించే పని రెండూ ఉంటాయి. గురువుకి రక్షించే పనే కాని శిక్షించే పని ఉండదు. గురువు అంటే వెలుగు, శాంతి, సుఖము! భగవంతుడిలో ఉన్న కృప, భగవంతుడిలో ఉన్న దయే రూపం దాల్చి వస్తుంది.

**మనల్ని పవిత్రులని చేసి ఆత్మజ్ఞానం వైపు మళ్ళించటమే గురువు పని.**

గురువుని ఆరాధిస్తే ఆయన స్నేహం నీకు ఇస్తాడు. ఆత్మ గురించి ఆత్మవిద్య గురించి బోధించటమే కాదు, నీతోటి చనువుగా ఉంటాడు. మీరు స్నానం చేసారా, భోజనం చేసారా, అందరూ బాగున్నారా అని అడుగుతూ ఉంటాడు. మీ స్థాయికి వచ్చి నడుస్తూ తిరుగుతూ ఉంటాడు. మీతోటి భోజనం చేస్తాడు. ఇవన్నీ చేస్తున్నప్పటికీ తానెవరో తనకి తెలుస్తూ ఉంటుంది గురువుకి. గురువంటే ఆత్మ, చైతన్యము, బ్రహ్మము. చావులేని సత్పదార్థమే గురువు. అక్కడికి మిమ్మల్ని తీసుకుపోవటానికి మీతో మాట్లాడుతూ ఉంటాడు, మీతో నడుస్తూ ఉంటాడు. మీకు తెలియకుండా మిమ్మల్ని తోలుకుపోతా ఉంటాడు. గురువు ఏ స్థితిలో ఉన్నాడో, ఆ స్థితి పొందటానికి మీలో ఏ ఆటంకాలు అయితే ఉన్నాయో, అవి మీకంటే గురువుకి బాగా తెలుస్తుంది. అక్కడ ఒకసారి బాటరీ లైట్ వేసి చూపిస్తాడు. నీ

బలహీనతలు, నీలో ఉన్న వేరుభావనని చూపించి, చూపించటమే కాదు, దానిని తొలిగించు కోవటానికి తగిన శక్తిని ఇస్తాడు. నీ స్వరూపం పొందటానికి ఏమైతే నీకు ఆటంకాలు ఉన్నాయో, ఆ ఆటంకాలని నెమ్మదిగా తొలిగించుకుంటూ వస్తాడు, వాడే గురువు! మనస్సు బాగుండటం లేదు, మనస్సు చిరాకుగా ఉందేమిటి అనుకుంటారు మీరు. మీతోటి మాట్లాడి మీ మనస్సుని సరిచేసుకుంటూ పోతాడు. మీ మనస్సుని నిర్మలం చేసి, ఏకాగ్రపరిచి, మీ మనస్సుని పవిత్రం చేస్తాడు. గురువంటే బ్రహ్మం. కర్తృత్వరహితమైనది అహంభావన రహితమైనది అజ్ఞానరహితమైనది బ్రహ్మం. మీ మనస్సుని తీసుకెళ్ళి అక్కడ సమాయుత్త పరుస్తాడు.

నీ మనస్సుకి లోదృష్టి, లోచూపు కలగటం కోసం, ఏ రకంగా నీకు బోధించాలో బయట ఉన్న గురువు నీకు అలా బోధిస్తాడు. బోధించి అక్కడ ఆపుచేయడు. లోపల ఉన్న గురువు లోపలికి లాక్కుంటూ ఉంటాడు. నిజమైన గురువు లోపలే ఉన్నాడు, నిజమైన గురువే నీకు బయట ఊరికే కాళ్ళు చేతులు తొడుక్కొని వేషం వేసుకొని వచ్చాడు. తాను ఎంత లోతులలో ఉన్నాడో అంత లోతుల్లోకి నువ్వు వెళ్ళేవరకూ గురువు స్థితి నువ్వు పొందేవరకూ నిన్ను వెంటాడుతూ ఉంటాడు. ఇక్కడ గురువు అంటే భగవాన్ చెప్పేది కాలేజీలోనూ హై స్కూల్ లోనూ చెప్పే మాస్టారులు అని కాదు. తను దేని గురించి చెపుతున్నాడో అది వాడు అయ్యి ఉండాలి, వాడు గురువు.

**గురువు మాట**

బ్రహ్మమే రూపం ధరించి, కాళ్ళు చేతులు తొడుక్కొని, మనతోటి మాట్లాడటానికి ఒక నోరు వేసుకొని గురువుగా వచ్చాడు. ఆ నోటినుంచి ఏది మాట్లాడినా శాంతి ఆనందం జాలువారుతుంది. ఏ వాక్యానికి ఆ వాక్యమే మహా ప్రవాహం, ఆకాశ గంగ, జ్ఞానామృతం. అయితే సీరియస్‌గా కోపంగా చెప్పడు. మీతోటి ఆడుకుంటా ఉంటాడు. మీతోటి నడుస్తూ, మీకేమీ నొప్పి కలగకుండా, మీ మనస్సుకి పట్టేటట్టు చెపుతాడు. సీరియస్‌గా ఏమీ చెప్పడు, మిమ్మల్ని సీరియస్ గా ఉంచడు. గురువు టెన్షన్‌లో ఉండడు, మిమ్మల్ని టెన్షన్‌లో పెట్టడు. ప్రతీ మాట టెన్షన్ లేకుండా, టెన్షన్ ఫ్రీగా, ఈగోలెస్‌గా, మీకు డైరెక్ట్‌గా హార్ట్ టు హార్ట్

టాక్! మీ మెదడు తోటి, మీ ఇంద్రియాలతోటి, మీ మనస్సుతోటి సంబంధం లేకుండా, తన హృదయంలో నుంచి వచ్చింది మీ హృదయంలోకి పంపేస్తాడు, వాడే గురువు. రెడీమేడ్! టైలర్‌కి బట్టలు ఇచ్చి కుట్టేవరకూ ఆగక్కరలేదు, అలా ప్రెజెంట్ చేస్తాడు. గురువు కంపాషన్, ఆ దయ అలా పని చేస్తూ ఉంటుంది. మీతోటి ఉంటూ మీకు తెలియకుండానే మీ మనస్సుకి నిర్మలత్వం, పవిత్రత, ఏకాగ్రత ఇస్తాడు. మీకు ఎరుక ఇస్తాడు, మెలుకువ గా ఉండేటట్టు చేస్తాడు. అయితే అది గమ్యానికి వెళ్ళేవరకూ మనకి తెలియదు. ఈ సుఖం ఎప్పుడో పొందుతాము అనుకున్నాము, ఎప్పుడో శాంతి వస్తుంది అనుకున్నాము, ఎన్నో జన్మల తరువాత ఆత్మజ్ఞానం వస్తుంది అనుకున్నాము, అప్పుడే వచ్చేసింది ఏమిటి! వచ్చేవరకూ మీకు తెలియదు, అసలు మీకు తెలియనివ్వడు. అలా చేసేవాడే గురువు.

ఆ వైభవం ఎలా ఉంటుందంటే – నాకే కనుక అజ్ఞానం ఉంటే ఇతరులకి బోధించటానికి నా దగ్గర ఏమీ లేదు, నేనే కనుక జ్ఞానినైతే బోధించటానికి నాకు ఇతరులు లేరు అన్నారు రమణ మహర్షి. అంటే నేను ఎవరినో ఉద్ధరించేస్తున్నాను లోకానికి జ్ఞానబోధ చేస్తున్నాను వాళ్లకి జ్ఞానం కలగచేస్తున్నాను అనే భావన ఉండదు. ఆటోమేటిక్‌గా పని జరుగుతూ ఉంటుంది అక్కడ.

**గురువు చూపు**

గురువు మనలో ఉన్న కీర్తిని చూడడు, మన కుతంత్రాన్ని చూడడు, మన శరీరం మన రంగు చూడడు, మన మనస్సుని చూడడు, మన బలహీనతలు, మన గుణాలు, వాసనలు చూడడు. గురువు హృదయములో ఏదైతే ఉందో అదే మన హృదయంలో ఉంది, సరిగ్గా దానినే చూస్తూ ఉంటాడు. డైరెక్ట్‌గా అక్కడ చూడటమే కాదు, మన ముఖాన్ని, మనస్సుని, మన ఇంద్రియాలని, మన బుద్ధిని అక్కడికి తిప్పుతాడు, అటు మళ్లిస్తాడు, అటు ఏకాగ్రత కుదురుస్తాడు. అక్కడ అన్నిటినీ సమకూరుస్తాడు. అక్కడికి చేరమని చెప్పటమే కాదు, అక్కడికి చేర్చుకునేవరకూ మనని వెంటాడతాడు, బోయవాడు జంతువుని ఎలా వెంటాడుతూ వెళ్తాడో, మన అజ్ఞానాన్ని అలా వెంటాడతాడు. ఆ ఆత్మ స్థితిలోకి ఆ దైవీ స్థితిలోకి మనకి తెలియకుండానే సర్జరీ లేకుండా మేల్కొలుపుతాడు, వాడు గురువు! ఈ ప్రక్రియ మనకి

లోపల మన హృదయంలో జరుగుతుంది.

లోపల ఎక్కడైతే ప్రశాంతత ఉందో, ఎక్కడైతే శాంతి ఉందో, ఎక్కడైతే వెలుగు ఉందో, అక్కడికి తీసుకెళ్లటానికి, ఆ హృదయ గుహలోకి ఆ హృదయలోయలలోకి తీసుకెళ్ళటానికి, ఆ మెంటల్ మేకప్, ఆ మైండ్‌ని ఎలా తయారు చెయ్యాలి, ఎలా ముగ్గేయాలి అవన్నీ చూసుకుంటాడు. లోపల ఉన్న వస్తువు ఎంత నిర్మలంగా ఉందో ఎంత నిశ్చలంగా ఉందో ఎంత ఏకాగ్రంగా ఉందో ఎంత సమానంగా ఉందో, మన మైండ్‌ని కూడా అలా చేసి, సదాకారం చేసి అందులో కలిపేస్తాడు, వాడు గురువు.

**ఉన్నది ఒక్కటంటే ఒక్కటే – అదే బ్రహ్మము, అదే గురువు**

మీ తల్లితండ్రులు మీకు శరీరం ఇచ్చారు, నీ శరీరానికి జన్మని ఇచ్చారు. కాని, గురువు జ్ఞానంలో జన్మ ఇస్తాడు. జ్ఞానంలో జన్మిస్తే మళ్ళీ భూమి మీదకి రావక్కరలేదు. ఎటు చూసిన శాంతే, ఎటు చూసినా ఆనందమే, ఎటు చూసినా సుఖమే. బ్రహ్మజ్ఞానములో జన్మని ఇచ్చేవాడు గురువు. నీకు అవసరం కాబట్టి, నీకోసం దేహం ధరించి వస్తాడు. అంతేకాని గురువుకి దేహం అక్కరలేదు, అన్నారు భగవాన్.

అయితే, నీకేదో ఉపకారం చేస్తున్నానని గురువు అనుకోడు. మీకు ఏదో ఉపకారం చేస్తున్నాను అని గురువు అనుకుంటాడు అనుకో, వాడు గురువు కాదు. మిమ్మల్ని ఉద్ధరిస్తున్నాను అనుకునేవాడు ఎవడూ గురువు కాదు. గురువు లోపల ఉంటాడు, బయట ఉంటాడు. పైన ఉంటాడు, కింద ఉంటాడు, అంతటా ఉంటాడు. గురువు అంటే బ్రహ్మమే!

ఉన్నది ఒక్కటంటే ఒక్కటే. అదే బ్రహ్మము. ఆ బ్రహ్మము యందు జగత్తు, జీవుడు, ఈశ్వరుడు కల్పించబడ్డాయి. ఆ బ్రహ్మమే మనకి జీవుడి గా కనిపిస్తున్నాడు. బ్రహ్మమే మనకి గురువుగా కనిపిస్తోంది. బ్రహ్మమే మనకి ఈశ్వరుడిగా కనిపిస్తోంది. అన్ని మతాలు చెప్పేది ఆ బ్రహ్మానందాన్ని పొందమని. ఎన్నో రకాల ఆనందాలు ఉన్నాయి, అన్నిటికంటే ఉన్నతమైనది, స్వతంత్రమైనది బ్రహ్మానందం.

**సేకరణ: 14 నవంబర్ 2004, పాలకొల్లు – శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు నుంచి**

**గురువు అంటే ఉండటమే!**

గురువుతోటి ఉన్న అనుబంధం, గురువు యొక్క శరీరం పతనమైన తరువాత కూడా కంటిన్యూ అవుతుందా అని రమణ మహర్షి గారిని ఒకరు అడిగారు. గురువు అంటే శరీరమైతే అవ్వదు, ఆ సంబంధం తెగిపోతుంది. కాని గురువు శరీరం కాదు కదా! గురువు అంటే – ఆత్మ, దైవము, ప్రేమ, శక్తి, చైతన్యము! గురువంటే ఉండటమే! శరీరం ఉంటే ఉండి, శరీరం లేనప్పుడు ఉండకపోతే, వాడు గురువే కాదు. గురువు ఆత్మే కాబట్టి గురువు యొక్క శరీరం లేకపోయినా, ఆ అనుబంధం అలా కంటిన్యూ అవుతూనే ఉంటుంది. అది మాటకి, మనస్సుకి, ఇంద్రియాలకి అందదు. గురువు ఏ స్థితిలో ఉన్నాడో, ఏ ఆనందాన్ని అనుభవిస్తున్నాడో, ఏ జ్ఞాన కెరటాలలో, ఏ చైతన్య ప్రవంతిలో ఊగిసలాడు తున్నాడో, భక్తుడిని ఆ స్థితికి తీసుకోచ్చేవరకూ, వాడు ఏ శరీరంలో ఉన్నా, ఏలోకంలో ఉన్నా, వాడిని విడిచిపెట్టడు.. అదే పులినోట్లో పడ్డ మాంసపు ముక్క! పులినోట్లో పడ్డ మాంసపు ముక్క బయటికి తీయగలం కాని గురువు యొక్క అనుగ్రహంలో పడ్డవాడు విడిచిపెట్టబడడు, వాడు ఏనాటికైనా తరించబడతాడు.

**(మూలం: 28 డిసెంబర్ 2004, జిన్నూరు, శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు)**

**షిరిడి సాయిబాబా అనుగ్రహం!**

కోరికలు తీర్చుకోవటానికి భగవంతుడిని ప్రార్ధిస్తూ ఉంటాము. షిరిడి సాయిబాబా అనేవారు – మీ కోరికలు నేను నెరవేరుస్తున్నాను, కాని ఆ కోరికలు నెరవేర్చటం కోసం కాదు, మీ ముఖాన్ని భగవంతుడి వైపు తిప్పటం కోసం నెరవేరుస్తున్నాను. మీరందరూ ఏదైతే కోరుకోవాలని నేను అనుకొంటున్నానో అటువైపు మీ ముఖాన్ని తిప్పటానికి నెరవేరుస్తున్నాను. ఎలాగంటే, పిల్లలు బడికి వెళ్ళనంటే వాళ్ళని బడికి పంపటం కోసం పటికబెల్లం ముక్క లేకపోతే శనగకాయలు ఏవో పెడతాము. బెల్లంముక్క ఇవ్వటం కోసం బెల్లంముక్క ఇవ్వము, బడికి పంపటానికి ఇస్తాము. అలాగే, మీరు మోక్ష స్థితిని పొందాలని, నిర్వాణస్థితిని, పూర్ణస్థితిని మీరు చేరుకోవాలని, మీ మనస్సు అటు ట్రైనింగ్ అవ్వటానికి, అటు మళ్ళించటానికి తాత్కాలికంగా లోకానికి సంబంధించిన కోరికలు నెరవేరుస్తూ ఉంటాను. కాని గమ్యం అది కాదు అన్నారు బాబా.

# వ్యాసం వందే జగద్గురుం

గురుర్ బ్రహ్మ, గురుర్విష్ణుం, గురుర్ దేవోమహేశ్వరః, గురుః సాక్షాత్ పరబ్రహ్మ, తస్మైశ్రీ గురవే నమః. ఏ మంచి పని చేయాలన్నా, ఏ పూజా కార్యక్రమమైనా, తాత్త్విక సమావేశమైనా, ప్రారంభించుటకు ముందు తమ తమ గురువులను, గురుపరంపరను స్మరించి ధ్యానించి నమస్కరించుట అన్నది మన సంప్రదాయం, మన ఆచారం. **గు** – అంటే చీకటి, **రు** – అంటే వెలుతురు. చీకటి అజ్ఞానానికి గుర్తు, వెలుతురు జ్ఞానానికి సంకేతం. కనుక చీకటి వంటి అజ్ఞానాన్ని పోగొట్టి, స్వరూప సచ్చిదానంద స్థితిలోకి ఎవరైతే మేల్కొలుపుతారో వారే నిజమైన గురువు.

గురువంటే ఆత్మజ్ఞాని అయి ఉండాలి, అనుగ్రహించే శక్తి కలిగి యుండాలి. ఐహిక అంధకారాన్ని తొలగించి, పారమార్థిక ప్రకాశాన్ని అందించేవారికే **గురువు** అనే పదం వర్తిస్తుంది. అలాంటి గురువును పరబ్రహ్మగా శుకోపనిషత్తు పేర్కొంటోంది. గురువు తన స్పర్శచేత, తన వాక్కుచేత, తన ప్రేమచేత, సంకల్పం చేత, మనల్ని పునీతుల్ని చేస్తారు. బ్రహ్మజ్ఞుడు, బ్రహ్మవిదుడు అయిన గురువు లేకుండా ఆధ్యాత్మిక వికాసం కలుగదు. గురువుకు పరిపూర్ణ శరణాగతి చెందడం కన్నా మించిన అర్హత లేదు. మన భారతీయ సంప్రదాయంలో భగవదవతారాలు అనబడే వారు కూడా గురువును ఆశ్రయించి బ్రహ్మజ్ఞానాన్ని పొందినవారే. అందుకే వేమన మహా యోగి

**విత్తనంబు గురువు విశ్వంబునకు నెల్ల**
**ప్రణవ మంత్రమొకటి పరమ గురువు**

అని గురువు యొక్క ఔన్నత్యాన్ని తెలియజేసారు. సద్వస్తువే సద్గురువు, జగత్తుకి మూల కారణము అనగా విత్తనము గురువు. పరిమితులు లేని పూర్ణచైతన్యమే పరమ గురువుగా అవతరిస్తుంది. గురువును ప్రత్యక్షదైవంగా పూజించడం మన సంప్రదాయం. గురువంటే శిష్యునిలో, నిగూఢమై ఉన్న జీవచైతన్య శక్తిని మేల్కొలిపి, జ్ఞాన జ్యోతిని వెలిగించే దైవస్వరూపుడని అర్థం. పవిత్రమైన గంగానదిలా గురువు తనను ఆశ్రయించిన వారిని కల్మషాలను కడిగి, స్వరూప జ్ఞానాన్ని అనుగ్రహిస్తారు. మనలోని "దివ్యత్వం" నివురు గప్పిన నిప్పులాంటిది. గురువు ఆ నిప్పును రాజేస్తారు. మన సనాతన సంప్రదాయంలో గురు శిష్య సంబంధం పరమ పవిత్రమైనదిగా భావిస్తారు. గురువంటే వ్యవహారిక సత్యం కాదు, పారమార్థిక సత్యం.

గురువు త్రిమూర్తి స్వరూపుడు.

**గురుర్ బ్రహ్మ –** గురువు బ్రహ్మము వలె మనలను నూతన మానవుడిగా సృష్టి చేస్తారు, అనగా రూపాంతరం చేస్తారు. "తత్త్వమసి" మున్నగు మహావాక్య బోధ చేసి, స్వరూప సచ్చిదానంద స్థితిలోకి మేల్కొలిపి, నూతన మానవుడిగా, మానవోత్తముడిగా సృష్టి చేస్తారు. మానవుడిని మహనీయుడుగా, మాధవుడుగా సృష్టిచేస్తారు. గురువు సృష్టికర్త పాత్రను పోషిస్తారు.

**గురుర్ విష్ణుః –** గురువు విష్ణువు వలె మనస్సును దాని మూలములో ఎరుకతో నిలిచియుండే స్థితిని కలుగజేస్తారు. అజ్ఞానము (లేదా) మాయలో పడకుండా మనల్ని రక్షిస్తారు. కనుక గురువు స్థితి కర్త.

**గురుర్దేవో మహేశ్వరః –** గురువు శివుని వలె మనలోని వాసనలను (అహంకారాన్ని) మ్రింగేస్తారు. మన అహంకారాన్ని హరింపజేస్తారు కనుక గురువు లయకర్త. గురువంటే మానవ దేహం ధరించిన దేవుడు అందువల్లే "గురుదేవుడు" అంటారు. గురువు ద్వారానే గోవిందుని దర్శనం అవుతుంది.

జీవునిలో అతనికి తెలియకుండా నిగూఢంగా ఉన్న ఆత్మ తత్త్వాన్ని ఎరుకపరచి, జ్ఞాన నిధిని అందించే వారే గురువు. శ్రీరామచంద్రుడు ఆత్మ సిద్ధి కోసం తన గురువైన వశిష్ఠులవారిని శ్రద్ధ మరియు విశ్వాసముతో కూడి అడిగినప్పుడు వశిష్ఠుడు 32వేల శ్లోకాలతో కూడిన యోగవాశిష్ఠమును శ్రీరాముడికి బోధించారు. అట్లే పరిక్షిత్తు మహారాజు మోక్ష మార్గాన్ని చూపమని తన గురువైన శుకమహర్షిని వేడుకున్నాడు. మన సాధనలు, శ్రవణ, మనన, నిధి ధ్యాసనముల కన్నా గురువనుగ్రహం వల్లనే ఆత్మసిద్ధి కలుగుతుందని సద్గురువు శ్రీనాన్నగారు చెప్పేవారు. గురుబోధను అందరూ వింటారు, శ్రద్ధావంతులే గ్రహించగలుగుతారు. ఒక వస్తువు ఉన్నా అది చీకటిలో తెలియదు, వెలుగు ఉంటేనే తెలుస్తుంది. పరమాత్మ కేవలం ఉన్నవాడే అయినా అజ్ఞానం అనగా దేహాత్మబుద్ధి ఉంటే తెలిసిరాడు, జ్ఞానం ఉంటేనే తెలుస్తాడు. చీకటిలో కనిపించని వస్తువు వెలుతురు రాగానే కనిపిస్తుంది. అనగా ఉన్న దానిని వెలుతురు (దీపం) చూపించగలిగిందే కానీ లేని దానిని సృష్టించలేదు. వెలుతురు ఉన్న దానికి సంబంధించిన అజ్ఞానాన్ని తొలగించింది అదే జ్ఞానం. చీకటిని పోగొట్టి వస్తుజ్ఞానాన్ని వెలుగు ఎలాగైతే కలిగిస్తుందో, అలాగే ఆత్మజ్ఞానం, అజ్ఞానాన్ని అంతము చేసి స్వరూపంగా ఉన్న పరమాత్మను సాక్షాత్కరింపజేస్తుంది. అట్టి పరమాత్మ జ్ఞానం పరమాత్మ కన్న వేరు కాదు కావున పరమాత్మ

జ్ఞానాన్ని అందించే గురువు పరమాత్మే అవుతారు. గురువాక్కులో నాలుగు వేదముల సారమైన బ్రహ్మజ్ఞానం ఉంటుంది. గురువు కాలాతీతుడు, కానీ వ్యవహారం కోసం కాలానికి కట్టుబడి ఉంటారు. మనకు శాస్త్ర జ్ఞానం లేకపోవచ్చు కానీ సకల శాస్త్ర జ్ఞానసారం గురువే అన్న జ్ఞానం ఉంటే గురువాక్యం అవుతుంది. సద్గురువు మాటలు మంత్రశక్తిని కలిగి ఉంటాయి. ఆయన మనతో మాట్లాడితే ఆ మాటలు మంత్రాలుగా స్వీకరించి అభ్యాసం చేయాలి. ఈ సృష్టిలో ప్రతీ వస్తువు తనదైన ప్రత్యేక స్వభావాన్ని కలిగి ఉంటుంది.

**గాలి స్వభావం వీచడం.**

**నిప్పు స్వభావం దహించడం.**

**నీరు స్వభావం ప్రవహించడం.**

**మనస్సు స్వభావం అలజడి, అశాంతి, ఆత్మస్తుతి, పరనింద**

**ఆకాశం స్వభావం సమస్తానికి తనలో అవకాశాన్ని కల్పించడం**

**ఆత్మ స్వభావం సచ్చిదానందం (కేవలం ఉనికి)**

**గురువు స్వభావం అనుగ్రహం (స్వరూపంలోకి మేల్కొలిపే శక్తి)**

మానవ జన్మ మోక్షద్వారం. గురువుపట్ల పూర్ణవిశ్వాసము కలిగియుండి, వారి బోధను అర్థం చేసుకుని ఆచరించి తదనుగుణంగా జీవించేవారు ముక్తిని పొందుతారు. మనకు నిజమైన బంధువు ఆత్మవిద్యను బోధించే గురువు. పరమాత్మే గురురూపంలో జ్ఞాన ద్వారాన్ని తెరుస్తుంది. గురుశిష్యుల మధ్య ఉన్న బాంధవ్యం అన్నిటికన్నా ఎంతో ఉత్కృష్టమైనది, పరమపవిత్రమైనది, అది వర్ణనాతీతము. మనకు గుణపాఠం నేర్పేది ప్రతీది గురురూపమే. మనల్ని అంతిమ సత్యంలోనికి మేల్కొలిపేది ప్రతీది గురురూపమే. ప్రయోజన దృష్టితోకాక, ప్రీతితో గురువును సేవించాలి. మనము గురువుకు శరణాగతి చెందితే ఇక మన పని పూర్తి అయిపోయినట్లే, ఆపై గురువు పని మొదలవుతుంది. విశ్వం–విష్ణుః అన్నారు పరమాత్మ. అంటే విశ్వం గురురూపమే. జగత్తును గురురూపంగా దర్శిస్తే, మోక్షప్రాప్తికి దోహదం చేసే ఆత్మీయుడవుతుంది. శ్రీకృష్ణ పరమాత్మ తనను ఆశ్రయించిన అర్జునుడికి అట్టి అనుభవమే అనుగ్రహించాడు, అందుకే ఆయన జగద్గురువు.

**(సద్గురు శ్రీ నాన్నచరణారవిందార్పణమస్తు)**

**(ది॥ 21-07-2024 గురుపూర్ణిమ సందర్భంగా సద్గురు ప్రసాదం)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 17 ఫిబ్రవరి 1996, చించినాడ

ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

జీవుడి యొక్క మూలం శిరస్సు కాదు, జీవుడి యొక్క మూలం హృదయమే. ఇక్కడ భగవాన్ ఏమి చెబుతున్నారు అంటే ఈశ్వరుడు పరమలోభి అంటున్నారు. పిసినారి తన పైసలను ఎంత జాగ్రత్తగా చూసుకుంటాడో, అలాగే మీకు వచ్చే తలంపులు, మీకు వచ్చే ఊహలు, మీకు వచ్చే సంకల్పాలు, మీకు వచ్చే కోరికలు అన్నింటినీ ఈశ్వరుడు తన యందు జాగ్రత్త పెట్టి ఉంచుతాడు. పిసినారి డబ్బు దాచిపెట్టినట్టు హృదయంలో ఉన్న కంట్రోలర్, హృదయంలో ఉన్న ఈశ్వరుడు అవన్నీ జాగ్రత్త పెట్టి ఉంచుతాడు. మీకు ఏదైనా చెడు తలంపు వచ్చింది అనుకోండి, ఆ తలంపు ఎక్కువసేపు ఉండకపోవచ్చు, ఆ తలంపు వచ్చిందని మీరు మర్చిపోతారు కానీ లోపల ఉన్న ఈశ్వరుడు పిసినారి కదా, వాడు ఆ తలంపుని జాగ్రత్తపెట్టి ఉంచుతాడు. రాబోయే జన్మల్లో ఏదో జన్మలో మీ చేత అనుభవింప చేయకుండా మటుకు ఆ తలంపుని బయటకి లాగడు, వాడు దేవుడు. కొంతమంది ఎలా ఉంటారంటే వాడి చెయ్యి నరికేసినా ఊరుకుంటారు కానీ ఆ చేతిలో ఉన్న పైసా ఇవ్వడు. అలా దేవుడు మీ సంకల్పాలను, మీ తలంపులను జాగ్రత్తపెట్టి ఉంచుతాడు. అంటే మంచి తలంపులు ఎలా జాగ్రత్తపెట్టి ఉంచుతాడో, చెడుకి చెడు తలంపులు కూడా అలాగే జాగ్రత్త పెట్టి ఉంచుతాడు.

అయితే దేవుడి రాజ్యాంగంలో ఒకటి ఉంది. మన హృదయంలో ఏవో తలంపులు ఉన్నాయి అనుకోండి, ఈనాటికి కాకపోయినా ముందు నాటికి అయినా, ఈ జన్మకి కాకపోయినా పది జన్మల తరువాత అయినా భగవంతుడు మనలో ఉన్న తలంపులను మనకి తెలియకుండా మటుకు బయటకి తీసి మంట పెట్టడు, ముందు మనకు ఇది తెలియాలి. ఫలానా సంకల్పం మీలో ఉందని మీకు తెలియాలి మీకు తెలిసిన తరువాత కానీ బయటకి తీసి వాడు మంట పెట్టడు. అంతవరకు వాడి దగ్గర జాగ్రత్త పెట్టి ఉంచుతాడు, మీ హృదయంలో ఉన్నప్పుడు మీ వాసన మీకే తెలియదు. పరమలోభి ఈశ్వరుడు, వాడు హృదయంలో నుండి విడిచిపెడతాడు, అప్పుడు మీ శిరస్సులోకి వస్తుంది. ఆ వాసన మీలో ఉన్నట్లు అప్పుడు మీకు తెలుస్తుంది.

దానిని మీ చేత అనుభవింపజేసి కానీ దానిని బయటకి తియ్యడు. అందుచేత మనకి చెడు తలంపు వచ్చినా, మంచి తలంపు వచ్చినా, ఏదో ఒక రోజున మన చేత సమాధానం చెప్పించిన తరువాత బయటకి తీస్తాడు. వాడు మన కం(ట్రోలర్.

వాసనలు అన్నీ ఎక్కడ ఉన్నాయి అంటే హృదయంలోనే ఉన్నాయి. దేవుడు ఎక్కడ ఉన్నాడు? హృదయంలోనే ఉన్నాడు. ఇవన్నీ వాడు చేతిలో పెట్టుకుని కూర్చుంటాడు. మీచేత అనుభవింపచేయటం కోసం ఒక్కొక్కటి విడిచిపెడుతూ ఉంటాడు. జీవుడికి కేంద్రం శిరస్సు కాదు, వాడి యొక్క మూలం మటుకు హృదయమే. భగవంతుడు ఏ హృదయంలో నేను ఉన్నాను అని చెబుతున్నాడో, అక్కడే జీవుడి యొక్క మూలం కూడా ఉంది. జీవుడు యొక్క ఆది అక్కడే ఉంది. ఆ జీవుడు తన ఆదిని చూసుకుంటే, అక్కడ నశిస్తాడు. ఎక్కడ జీవుడు నశిస్తే అక్కడ వాడు దేవుడు అవుతాడు. మీలో ఉన్న జీవలక్షణాలు అన్నీ నశించాయి అనుకోండి వెంటనే మీరు దేవుడు అయిపోతారు. ఎందుచేత? అక్కడ ఉన్నవాడు దేవుడే కాబట్టి!

జీవుడు పుట్టిన చోటు హృదయం, విజృంభించే చోటు శిరస్సు. ఈ రెండింటినీ కనెక్ట్ చేసే ఒక అమృతనాడి ఉంది. అది మన శరీరాన్ని కోసిచూస్తే కనపడదు. అంటే మెదడుకి, అమృతనాడి అని హృదయానికి నాడి ఒకటి ఉంది. తపస్సు చెయ్యటం వల్ల, అహంభావం లేకుండా జీవించడం వల్ల, భగవంతుడికి సంబంధించిన పని చెయ్యడం వల్ల, ఎవడైతే పరిశుద్ధుడో, ఎవడైతే పరమ పవిత్రుడో, ఏకాగ్ర చిత్తం ఎవడైతే సాధించాడో, ఎవరికైతే సింప్లిసిటీ ఉందో వాడిలో మటుకు అమృతనాడి ఓపెన్ అవుతుంది. అది ఓపెన్ అయినపుడు మటుకు లోపల ఉన్నటువంటి చల్లదనం, లోపల ఉన్నటువంటి ఆనందం ఒక్కసారి శిరస్సుకి తెలుస్తూ ఉంటుంది. అమృతనాడి అందరిలోనూ ఓపెన్ అవ్వదు. ఏకాగ్రత ఉన్నవాడికి, పవిత్రత ఉన్నవాడికి ఓపెన్ అవుతుంది. అమృతనాడి ఎప్పుడైతే ఓపెన్ అయ్యిందో, అరచేతిలో ఉన్న వస్తువు మన కళ్లకి ఎంత స్పష్టంగా కనిపిస్తుందో, అంత స్పష్టంగా అమృతనాడి ఓపెన్ అయినపుడు వాడి హృదయంలో ఉన్న వస్తువు వాడికి తెలుస్తూ ఉంటుంది. వాడితోటి దేవుడు ఉన్నాడని చెప్పినా ఒక్కటే, లేడని చెప్పినా ఒక్కటే. మనం ఏమి మాటలు అన్నా చంటిపిల్లల మాటలు లాగ తీసుకుంటాడు. చంటిపిల్లలు ఏవో ఒకటి మాట్లాడుతూ ఉంటారు మనం పట్టించుకోము.

అలాగే బ్రహ్మానుభవం పొందిన వాడు, మన మాటలను కూడా చంటిపిల్లల మాటలు లాగ చూస్తాడు. నవ్వుకుంటాడు కానీ కోపం తెచ్చుకోడు.

బ్రాహ్మీస్థితి పొందిన వాడికి దేహం కనిపించకపోయినా, లోకం కనిపించకపోయినా వాడు ఉన్నాడన్న సంగతి వాడికి స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది. వాడిని భయం విడిచిపెడుతుంది, రాగం విడిచిపెడుతుంది, దుఃఖం విడిచిపెడుతుంది, సమస్తం ఈ జీవలక్షణాలు అన్నీ వాడిని విడిచిపెట్టి వెళ్లిపోతాయి. బ్రాహ్మీస్థితి ఎవడైతే పొందాడో వాడికి దేహం కనపడదు అనుకోండి, లోకం కనపడదు అనుకోండి, దేహం కనపడకపోయినా, లోకం కనపడకపోయినా మనం ఉన్నాం అన్న సంగతి వాడికి ఎంత స్పష్టంగా తెలుస్తుంది అంటే అరచేతిలో ఉన్న వస్తువు మన కళ్లకి ఎంత స్పష్టంగా తెలుస్తూ ఉంటుందో, అంత స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది కాబట్టి ఇంక మరణ భయం వాడికి ఉండదు. పైగా దేహం లేకపోవడం వల్ల కూడా వాడికి లాభం ఒకటి ఉంది. దీనికి స్నానం చేయించటం, అన్నం పెట్టడం, ఈ ఊరు నుంచి ఆ ఊరుకి తిప్పడం, ఈ బాధ ఒకటి తప్పుతుంది వాడికి. ఈ శవాన్ని తిప్పడం తప్పుతుంది. మనకి శివబుద్ధి కలిగే వరకు శవబుద్ధి విడిచి పెట్టదు. శివజ్ఞానం అంటే ఆత్మజ్ఞానం.

అందరు శవ వాహకులే అన్నారు భగవాన్. శవాన్ని స్మశానం దగ్గరకు మోసుకుని వెళ్ళే వారిని శవ వాహకులు అంటారు. భగవాన్ ఏమంటున్నారు అంటే నీ శరీరం చనిపోయాక నలుగురు మోసుకుని వెళుతున్నారు. నీ శరీరం ఇప్పుడే పడిపోయింది , ఎవడి శవాన్ని వాడే మోసుకుంటున్నాడు అని. ప్రతీవాడు కూడా శవవాహకుడే, ప్రతీవాడు కూడా విగ్రహారాధకుడే. విగ్రహాన్ని ఆరాధించేవాళ్ళని విగ్రహాలను ఆరాధిస్తున్నారు, రాళ్ళని మొక్కుతున్నారు అని కొంతమంది తప్పుపడతారు. అందరూ కూడా శవాన్ని ఆరాధిస్తున్నారు, ఈ శవాన్ని ఎవరిని ఏమాట అననివ్వరు. దీనికి సెంటు రాస్తాం, పౌడర్లు రాస్తాం, మంచి బట్టలు తొడుగుతాం, అందుచేత ఇది కూడా ఆరాధనే కదా. ఈ శరీరం శవం కదా దీనిని ఆరాధించని వాడు ఎవడు ఉన్నాడు ఈ లోకంలో అన్నారు. ఈ శవాన్ని అందరూ ఆరాధిస్తున్నారు.

మనస్సు నిశ్చలం కావాలి, నిర్మలం కావాలి, ఏకాగ్రం కావాలి. తపస్సు చెయ్యడం వల్ల మనస్సు నిర్మలం అవుతుంది. ఉపాసన లేకపోతే మోక్షం రాదని చెపుతారు. ఒక

అవతార పురుషుడిని, ఒక మహా గురువుని, ఒక మహా జ్ఞానిని ఉపాసన చెయ్యటం వల్ల మనస్సు నిశ్చలం అవుతుంది, మనస్సు నిర్మలం అవుతుంది. మీ మనస్సు నిర్మలం అవ్వడానికి, మీ మనస్సు నిశ్చలం అవ్వడానికి, మీ మనస్సు ఏకాగ్రం చెందడానికి మీరు చేస్తున్న ప్రయత్నమే తపస్సు. అంటే మీ మనసుని తపింపచేసుకుంటే అది తపస్సు, మీ మనస్సుని ఎండబెట్టడమే తపస్సు. తపస్సు వల్ల ఏమి వస్తుంది అంటే మనకి పరిశుద్ధత వస్తుంది, ఏకాగ్రత వస్తుంది.

ఒక డాక్టరు గారు ఏమని అడుగుతున్నారు అంటే ఆధ్యాత్మిక హృదయం ఎక్కడ ఉందో చూడవచ్చునా అని అడుగుతున్నారు. భగవాన్ ఏమని చెబుతున్నారు అంటే దానికి పనిముట్టు కూడా అక్కర్లేదు, అది నీ అనుభవానికి తెలుస్తుంది. నువ్వు వచ్చి నన్ను ముట్టుకున్నావు అనుకో, నేను వచ్చి నిన్ను ముట్టుకున్నాను అనుకో, అది స్పర్శ. స్పర్శ కంటే దగ్గరగా అది నీకు అనుభవానికి తెలుస్తుంది. పనిముట్లు, సామాన్లు కూడా అక్కర్లేదు. అది ఉండడం వల్లే అది తెలియబడుతుంది. ఆ డాక్టరు గారిని భగవాన్ ఏమని అడుగుతున్నారు అంటే నువ్వు ఉన్నావు అది సత్యమా? అసత్యమా? ధ్యానం ఎవరు చేస్తున్నారు నువ్వే చేస్తున్నావు. నువ్వు ధ్యానం చేస్తున్నావు అంటే నువ్వు ఉన్నావన్న సంగతి నువ్వు ఒప్పుకుంటున్నావు. ధ్యానం ఎక్కడ జరుగుతుంది? నీ లోపలే జరుగుతుంది. ఈ నేను ఎక్కడ ఉంటే అక్కడే ధ్యానం జరుగుతూ ఉండాలి. నేను అనే తలంపు నీ దేహానికి విడిగా లేదు, నీ లోపలే అది ఉంది. ఈ నేను అనే తలంపు నీకు బయట లేదు, లోపలే ఉందన్న సంగతి తెలియడానికి పనిముట్లు కావాలా? ఏమి అద్భుతమైన టీచింగ్ చూడండి. ఈ నేను అనే తలంపు నీకు బయట లేదు నీ లోపలే ఉందన్న సంగతి నీకు స్పష్టంగా తెలుస్తుంది. దానికి పనిముట్లు ఎందుకు? రోగం స్పష్టంగా తెలియనప్పుడు x-ray, రోగం స్పష్టంగా తెలిసినప్పుడు X-ray ఎందుకు? నీకు స్పష్టంగా తెలిసేటప్పుడు complicate చేసుకుంటావు ఎందుకు అని.

ఈ నేను అనే తలంపు నీకు లోపల నుంచే వస్తోంది కాబట్టి దాని కేంద్రం కూడా లోపలే ఉండాలి. ఆ కేంద్రమే దేవుడు. నీకు ధ్యానం చేసే సరదా ఉంటే, విచారణ చేసే సరదా ఉంటే నేను ఒకటి ఉంది కదా, దానితోటి సాధన చెయ్యి, ఆ నేను తోటే నువ్వు

విచారణ చెయ్యి. ఆ నేను ఉంటే ధ్యానం, నేను ఉంటే సాధన, నేను ఉంటే విచారణ కానీ నేను లేకపోతే సాధన ఏమిటి? ధ్యానం ఏమిటి? విచారణ ఏమిటి? శరీరం ఉన్నవాడికి రోగం, శరీరం లేనివాడికి రోగం ఏమిటండి అసలు. అదేవిధంగా మీకు నేను అనే తలంపు ఉంది కాబట్టి ధ్యానమో, జపమో, పూజో ఏదో ఒకటి చెయ్యి. అది లేకపోతే ఏ గొడవ లేదు. శరీరం లేనివాడికి రోగం ఏవిధంగా అయితే ఉండదో, ఆ నేను అనే తలంపు లేని వాడికి దుఃఖం లేదు.

ఠాగూర్ అంటూ ఉంటాడు గీతాంజలిలో, ఎక్కడ దుఃఖం లేదో అక్కడకు నన్ను మేల్కొలుపు, ఎక్కడ దుఃఖం లేదో అక్కడకు నన్ను తీసుకుపో అని మనం భగవంతుడిని ప్రార్థిస్తాము. నువ్వు ఉన్నావని నీకు తెలుసు, నువ్వు ఉన్నావని నీకు ఏమి అనుమానం లేదు. ఎక్కడ ఉన్నావు నువ్వు? దేహం లోపలే. ఉన్నావన్న సంగతి నీకు తెలుస్తోంది. దేహం వచ్చేటప్పటికి మనిషికి దుఃఖం వచ్చేస్తుంది. మీరు వంద కోట్లు డబ్బు ఉన్న కుటుంబంలో పుట్టండి మీకు దుఃఖం విడిచిపెట్టదు, క్రోధం విడిచిపెట్టదు, అశాంతి విడిచిపెట్టదు. కారణం ఏమిటి అంటే దేహం వచ్చేటప్పటికి వాడు దేహంతోటి తాదాత్మ్యం పొందుతాడు. దేహానికి పరిమితులు ఉన్నాయి, దేహానికి హద్దులు ఉన్నాయి. ఈ పరిమితులు లోంచి, ఈ హద్దులు లోంచి అతి వేగంగా దుఃఖం వచ్చి నిన్ను మూసేస్తుంది. పునర్జన్మ

**జ్ఞానికి శరీరం ఉన్నా ఒకటే, లేకపోయినా ఒకటే. శరీరం లేకపోయినా జ్ఞాని అస్థిత్వానికి భంగం లేదు. శరీరం ఉన్నప్పుడు కూడా వారు శరీరం కాదు. వారి ద్వారా ఏ శక్తి అయితే పని చేస్తోందో ఆ శక్తికి చావు లేదు. శరీరం లేకపోయినా అది పనిచేస్తూనే ఉంటుంది.**



వచ్చింది అంటే ఇంక మనిషిని దుఃఖం విడిచిపెట్టదు. కృష్ణుడికి దేహం వచ్చింది అయితే తాను దేహంలో ఉన్నప్పుడు కూడా తాను దేహమాత్రుడిని కాదు అన్న సంగతి వాడికి తెలుస్తూ ఉంటుంది, అందుచేత వాడికి పరిమితులు లేవు, వాడికి దుఃఖం లేదు.

మీలో ఎవరైనా నల్లగా ఉన్నారు అనుకోండి. మీరు నల్లగా ఉన్నారు అంటే రాత్రి మీకు నిద్ర పట్టదు. మీరు కృష్ణుడిని నల్లగా ఉన్నావు అనండి వాడికున్న శాంతి చెదరదు, సంతోషం చెదరదు. ఎందుకు చెదరదు? వాడు దేహానికి పరిమితమై లేడు. దేహానికే పరిమితమైన పెళ్లికూతురుని నల్లగా ఉంది అంటే వెంటనే కళ్ళనుండి నీరు వచ్చేస్తుంది పాపం. ఆ నలుపు పెళ్లికూతురు కాదు ఆ స్కిన్‌తోటి, ఆ బాడీ తోటి ఉన్న తాదాత్మ్యం వలన వెంటనే దుఃఖం వచ్చేస్తుంది. ఇప్పుడు బాగా తెల్లగా ఉన్న వాళ్ళను మీరు కలర్ బాగున్నారు అనండి వాళ్లకి గర్వం వస్తుంది, సంతోషం వస్తుంది, అది కూడా వాళ్ళకు దేహంతో ఉన్న తాదాత్మ్యమే. నువ్వు ఉన్నావని నీకు తెలుసు దానికి పుస్తకాలు ఏమి చదవక్కరలేదు. నువ్వు ఉన్నావన్న సంగతి నీకు తెలియడానికి శాస్త్రాలతోటి ఏమి పనిలేదు. ఆ ఉన్నది నీ దేహం లోపలేఉన్నావు కానీ బయట లేవు అన్న సంగతి కూడా నీకు తెలుస్తుంది. నువ్వు ఉన్నావా అంటే, నేను ఉన్నాను అంటున్నావు. అంటే శరీరం అంతటా వ్యాపించి ఉన్నావా? ఒక్క చోటే ఉన్నావా? అన్నిచోట్లా ఉన్నావా? ఎక్కడో ఒకచోటే ఉన్నావా? అంటే డాక్టరు గారికి తెలియకుండా ఆయనని లోపలకు తోలుకుపోతున్నారు భగవాన్.

నేను అనే తలంపు నీకు వస్తుంది. అంతటి లోంచి వస్తుందా? లేకపోతే ఒక పాయింట్లోంచి నీకు వస్తుందా? ఇది బాగా అర్థం చేసుకోండి, మీరు లోపల ఉన్నారు, లోపల ఉన్నారు అంటే దేహం అంతటి లోంచి నేను అనే తలంపు వస్తుందా మీకు? దేహం అంతటి లోంచి రావడం లేదు. ఏదో ఒక ప్లేస్ లోంచి మీకు నేను అనే తలంపు వస్తుంది. ఈ తలంపు రావడానికి లోపల ఒక చోటు ఉంది, అదే కేంద్రం. దానిని నువ్వు అన్వేషించాలి. నీకు కాళ్ళు చేతులు పోయాయి అనుకో, ఇంద్రియాలు చచ్చుపడిపోయాయి అనుకో, నీ శరీరం ముసలిది అయిపోయింది అనుకో, కానీ నేను ఎక్కడ నుంచి వస్తుందో ఆ సెంటర్ నీకు తెలుస్తూనే ఉంటుంది. ఎందుచేత? ఆ సెంటర్‌కి శరీరం తోటి సంబంధం లేదు.

నువ్వు బాగా ముసలివాడవు అయిపోయావు అనుకో, నీ శరీరం చావడానికి సిద్ధంగా ఉందనుకో, నేను అనే తలంపు ఏ సెంటర్ లోంచి వస్తుందో ఆ సెంటర్ ముసలిది అవ్వలేదు, అది దేవుడు. ఆ లాజిక్ చూడండి. నీకు చెవులు వినపడటం లేదు, కళ్లు కనపడటం లేదు, కాళ్ళేమో నడవను అంటున్నాయి, చేతులు పనిచేయను అంటున్నాయి, ఇంట్లో వాళ్ళేమో పొమ్మంటున్నారు, స్మశానం రమ్మంటుంది అనుకోండి, ఆ పరిస్థితిలో మనం ఉన్నాం అనుకోండి, అప్పుడు కూడా ఈ నేను అనే తలంపు ఒక చోటు నుంచి వస్తుంది కదా, అది మటుకు ముసలిది అవ్వలేదు, అది అలాగే ఉంది. నీ శరీరం ముసలిది అయిపోయింది కానీ ఆ సెంటర్ ముసలిది అవ్వలేదు. శరీరం బాల్యంలో ఉన్నప్పుడు అలాగే ఉంది, యవ్వనంలో ఉన్నప్పుడు అలాగే ఉంది, ముసలి శరీరం వచ్చినప్పుడు కూడా అలాగే ఉంది. ఇంతకీ ఏమి చెబుతున్నారు అంటే, ఆ కేంద్రం నీ శరీరంలో భాగం అయితే నీ శరీరంలో అవయవాలు ఏవిధంగా అయితే ముసలివి అయిపోతున్నాయో, ఆ కేంద్రం కూడా ముసలిది అయిపోవాలి. నీ శరీరంలో భాగం కాదు కాబట్టి అది ముసలిది అవడంలేదు. అప్పుడు కూడా నేను స్ఫురణ లోపల నుంచి వస్తుంది. కాబట్టి ఏదో ఒక కేంద్రం ఉందని నువ్వు ఒప్పుకోవాలి. విషయం నీకు అనుభవం అవ్వకపోయినా commonsense బట్టి ఆలోచించినప్పటికీ ఈ నేను అనే తలంపుకి ఏదో ఒక సెంటర్ ఉంది శరీరంలో, ఆ సెంటర్ నీకు తెలియకపోవచ్చు కానీ ఏదో ఒక సెంటర్ ని నువ్వు అంగీకరించే తీరవలెను. దానినే మన పెద్దవాళ్ళు హృదయం అన్నారు. హృదయం అన్నా, ఆత్మ అన్నా, దేవుడు అన్నా, చైతన్యం అన్నా, పరాశక్తి అన్నా, అన్నీ ఒక్కటే. అంటే హృదయం శక్తి లేకుండా ఉండదు, జ్ఞానం లేకుండా ఉండదు, తేజస్సు లేకుండా ఉండదు.

కొంతమందిలో చైతన్యస్థాయి ఎక్కువ ఉంటుంది, కొంతమందిలో తక్కువ ఉంటుంది. మనకంటే చైతన్యస్థాయి తక్కువ ఉన్నవాళ్ళ తోటి సహవాసాలు చేస్తారు అనుకోండి, మనం కూడా అలాగే తయారవుతాం. మనమే మొద్దు అబ్బాయిలం అనుకోండి, మనకే నూటికి పది మార్కులు మించి రావడం లేదు, ఇంక సున్న వచ్చిన వాడి తోటి సహవాసం చేస్తే ఒక సంవత్సరం లోపులో మనం సున్నలు అవుతాం. మనకంటే చైతన్యస్థాయి ఎక్కువ

ఉన్నవాళ్ళ తోటి, మనకంటే జ్ఞానం ఎక్కువ ఉన్నవాళ్ళ తోటి మనం సహవాసాలు చేస్తే మనం తేజోవంతులం అవుతాం. మనం పండితుల తోటి సాంగత్యం చేశాం అనుకోండి ఎంత మొద్దు అబ్బాయిలం అయినా మనకి పాండిత్యం వచ్చేస్తుంది. బుద్ధి విశాలంగా ఉన్న వాళ్ళతోటి స్నేహం చేస్తే ఆ విశాలత్వం మనకి కూడా వచ్చేస్తుంది. పెద్దవాళ్ళు చెబుతారు ఆరు మాసాలు స్నేహం చేస్తే వాడు వీడు అవుతాడు అని.

మీ హృదయంలోనే సత్యం ఉంది దానికి పుట్టుక లేదు, దానికి ముసలితనం లేదు, దానికి మరణం లేదు. నీ బుద్ధికి అది ఒక object కాదు. నీ హృదయంలో ఉన్న సత్యం నీకు అనుభవంలోకి వచ్చేవరకు బాహ్యంగా ఉన్న సత్పురుషుల తోటి, సహృదయుల తోటి సహవాసం చెయ్యి. బాహ్యంగా ఉన్నటువంటి సత్పురుషుల తోటి, సహృదయుల తోటి కనుక నువ్వు సహవాసం చేస్తే నీ హృదయంలోని సత్యాన్ని నువ్వు తెలుసుకోవడానికి వాళ్ళు నీకు సహకరిస్తారు. అదే సజ్జన సాంగత్యం. మనం కనిపించిన ప్రతీ పుస్తకం చదవకూడదు. కనిపించిన ప్రతీ వారితోటి కూడా సహవాసం చెయ్యకూడదు. ఎవరితోటి మనం సహవాసం చేస్తే మనలో ఉన్న తేజస్సు, మనలో ఉన్న శాంతి, మనలో ఉన్న కాంతి అభివృద్ధి అవుతుందో అట్టి స్నేహితులను మనం ఎన్నుకోవాలి. భగవంతుడు అందరి హృదయాలలోనూ ఉన్నాడు. ఉన్నాడు అంటే హృదయం వేరు, దేవుడు వేరు కాదు. నీకు సంశయాలు ఎందుకు కలుగుతున్నాయి అంటే హృదయాన్ని స్థూల వస్తువుగా చూడాలి అనుకుంటున్నావు. కాని దానికి రూపం లేదు. నేను అనే తలంపు నీ లోపల నుంచే వస్తుంది, ఆ సెంటర్ నీకు కనపడడం లేదు, నీకు అనుభవంలో లేదు. అయినంత మాత్రం చేత అది లేదు అని మటుకు నువ్వు చెప్పలేవు. ఏదో ఒక సెంటర్ లోంచి అది రావాలి కదా, అది లేదని నువ్వు చెప్పలేవు. ఆ సెంటర్ నువ్వు స్థూలంగా ఉంది అనుకుంటున్నావు. అది సూక్ష్మాతి సూక్ష్మమైనది. ఆత్మ మాట వదిలేయండి, దేవుడి మాట వదిలేయండి, మామూలుగా మనం ఏదైనా పుస్తకం చదివితే స్థూలబుద్ధి ఉన్నవాడికి అందులో ఏముందో, ఏమిటో తెలియదు. స్థూల బుద్ధి ఉన్నవాడు అది చదివినా వాడికి గ్రహించే శక్తి ఉండదు, బుద్ధిసూక్ష్మత ఉన్నవాడు వెంటనే గ్రహిస్తాడు. స్థూలబుద్ధి ఉన్నవాడు దేవుడిని బాహ్యంగా వెతుకుతాడు. సూక్ష్మబుద్ధి

ఉన్నవాడు ఆ బుద్ధి యొక్క కేంద్రాన్ని వెతుకుతాడు. అది స్థూలంగా లేదు, స్థూలంగా ఉందేమో, దానికి ఒక ఆకారం ఉందేమో అనుకుంటున్నావు. దానికి ఆకారం లేదు, ఆకారం లేకపోయినా అది ఉంది. ఆకారం ఉందేమో అని నువ్వు అనుకుంటున్నావు, అందుచేత పొరపాట్లు ప్రారంభమవుతాయి. జీవుడు చేసే తప్పు దేవుడు చెయ్యడు. జీవుడు దేహంలో ప్రవేశిస్తే ఆ దేహానికి పరిమితమై ఉంటాడు, దానితోటి identify అవుతూ ఉంటాడు. దేవుడు కూడా దేహంలో ప్రవేశించవచ్చు, కానీ ఆ దేహంతోటి పరిమితమై ఉండడు. జీవుడు చేసిన తప్పు దేవుడు చెయ్యడు. ఎందుచేత? వాడికి తెలుసును, వీడికి తెలియదు.

కృష్ణుడు అర్జునుడితోటి ఒక మాట చెప్పాడు, ఓ అర్జునా నీకు అనేక పూర్వజన్మలు గడిచిపోయాయి, నాకు అనేక పూర్వజన్మలు గడిచిపోయాయి. కానీ నీకు నాకు ఒక్కటే తేడా అన్నాడు. ఆ జన్మలు అన్నీ నాకు తెలుసు, నీకు మటుకు ఆ జన్మలు అన్నీ తెలియవు. తెలియటం, తెలియకపోవటం ఒక్కటే తేడా కానీ శవాలను నువ్వు మోసావు, నేను మోసాను అన్నాడు. కృష్ణుడి అవతారం ఎటువంటిది అంటే వాడు ఎప్పుడూ నవ్వటమే, ఏమి జరిగినా నవ్వుతూనే ఉండేవాడు, ఎప్పుడూ సంతోషమే, దుఃఖం మనకు కనబడదు. మనకేమో పుట్టినప్పుడు ఏడుపే, బ్రతికినప్పుడు ఏడుపే, చచ్చినప్పుడు ఏడుపే, ఏక ఏడుపే మనకి, ఆయనకి ఏక సంతోషమే. కృష్ణుడికి కావాల్సిన వాళ్ళు చచ్చిపోతే అప్పుడు కూడా నవ్వటమే, అదేమి నవ్వటమో మనకు తెలియదు. వాళ్ళుపోయినా దుఃఖపడవలసిన పని లేదు కానీ అది తెలియక దుఃఖపడుతున్నాం అంటాడు. మనకి తెలియటం లేదు కాబట్టే అంత దుఃఖ పడుతున్నాం, ఆయనకి తెలుస్తుంది కాబట్టే అసలు దుఃఖపడడం లేదు. పుట్టినవాడు చనిపోవటం ఎంత ఖాయమో, చనిపోయినవాడు పుట్టడం కూడా అంతే ఖాయం.

కృష్ణుడిని జరాసంధుడు వాళ్ళు తరుముకు వస్తే పారిపోయాడు, ఆ పారిపోయినపుడు కూడా నవ్వుతూ పారిపోయాడు. కృష్ణుడిని అందరూ దేవుడు అనుకుంటున్నారు, జరాసంధుడు తరుముకు రావడం ఏమిటి, దేవుడు పారిపోవడం ఏమిటి, ఇంతకంటే అవమానం ఏమిటి అని ప్రజలు అనుకుంటారు అని ఏమి గొడవ లేదు, ఆ పారిపోవటం కూడా నవ్వుతూ పారిపోతున్నాడు. ఎందుచేత అంటే ఆయనకి దేహబుద్ధి లేదు. ఆ

పారిపోయింది ఎవరు? దేహం పారిపోతుంది. ఆయన ఎవరు? దేవుడే. దేహం యొక్క చలనాన్ని తన మీద ఆరోపించుకోవడం లేదు. దేహబుద్ధి ఉన్నవాడు దేహం యొక్క చలనాన్ని తనమీద ఆరోపించుకుంటాడు. దేహబుద్ధి నశించినవాడు దేహం యొక్క చలనాన్ని తనమీద ఆరోపించుకోడు. దేహబుద్ధి ఉన్నవాడు దేహం మరణించినప్పుడు నేను మరణిస్తున్నాను అనుకుంటాడు. దేహం మరణించినప్పుడు కూడా దేహబుద్ధి లేనివాడికి నేను మరణించటం లేదు అన్న సంగతి తెలుస్తూ ఉంటుంది. అప్పుడు కూడా వాడికి సంతోషమే. దేహం యొక్క గతి, దేహం యొక్క చలనం దేహబుద్ధి లేనివాడికి పట్టదు, వాడు ఆరోపించుకోడు, identification వాడికి ఉండదు. జయం వచ్చినప్పుడు సంతోషం ఉండదు, అపజయం వచ్చినప్పుడు వాడికి దుఃఖం ఉండదు. ఎందుచేత? వాడు ద్వంద్వాలకి అతీతుడు. అసలు సత్యం ద్వంద్వాలకి అతీతంగా ఉంటుంది.

నీ మనసుకి ఏదైనా చాపల్యం వస్తుంది అంటే అక్కడ ద్వైతబుద్దే దానికి కేంద్రం. మన మనస్సు చలిస్తుంది అంటే అది మనకి దేహబుద్ధి ఉన్నట్టే గుర్తు. ప్రపంచము ఒక తలంపు, దేహము ఒక తలంపు, ఇష్టము ఒక తలంపు, అయిష్టము ఒక తలంపు, క్రోధము ఒక తలంపు, రాగం ఒక తలంపు, భయం ఒక తలంపు, దేహం చనిపోతున్నప్పుడు మనం ఏమి అనుకుంటాం? నేను చనిపోతున్నాను అనుకుంటాం. చావు కూడా నిజం కాదు, చావు కూడా ఒక తలంపు. కాని హృదయం మటుకు తలంపు కాదు అంటున్నారు భగవాన్. అందరికీ తలో ఒక దేహం ఉంది కదా, ఈ దేహం కూడా ఒక తలంపే. ఎందుచేత అంటే గాఢనిద్రలో నీకు దేహం ఉన్నా ఉన్నట్టు నీకు తెలియదు. చావే కాదు దేహం కూడా ఒక తలంపే. దేహం చనిపోయినప్పుడు నేను చనిపోతున్నాను అని నీకు అనిపిస్తుంది, అనిపించడం కూడా ఒక తలంపే. అంటే హృదయం తప్పించి, అసలు సత్యం తప్పించి, దేవుడు తప్పించి మిగతావి అన్నీ కూడా తలంపులే. నీ దుఃఖం కూడా ఒక తలంపే, నీ గర్వం కూడా ఒక తలంపే. మిమ్మల్ని ఎవరైనా పొగిడారు అనుకోండి, మీ మీద ఎవరైనా పద్యాలు రాశారు అనుకోండి అప్పుడు గర్వం వస్తుంది అది కూడా ఒక తలంపే. మీ కోడలు, కూతురు ఎవరైనా తిట్టారు అనుకోండి అప్పుడు ఏమి వస్తుంది మీకు? Depression వస్తుంది, దుఃఖం

వస్తుంది అది కూడా ఒక తలంపే. కొంతమంది కంటే నేను ఎక్కువగా ఉన్నాను అని compare చేసుకుంటారు ఆ రూపాయిలు చూసుకుని అది కూడా ఒక తలంపే, అన్నీ తలంపులే. కానీ ఈ నేను అనే బుద్ధికి కేంద్రంగా ఉన్న హృదయం మటుకు తలంపు కాదు. ఎందుచేత అంటే నీకు తలంపులు లేనప్పుడు కూడా, గాఢనిద్రలో కూడా అది ఉంది. నీ హృదయం మటుకు తలంపు కాదు. నీ తలంపుకి పరిమితమై అది లేదు. గాఢనిద్రలో నువ్వు ఉన్నావు, గాఢనిద్రలో నేను లేనని ఎవడూ చెప్పడు, అది హృదయం. ఇది మీరు బాగా అర్థం చేసుకోండి. సింపుల్‌గా చెబుతున్నారు, సైంటిఫిక్‌గా చెబుతున్నారు ఇక్కడ. గాఢనిద్రలో నువ్వు ఉన్నావు, నువ్వు గాఢనిద్రలో ఎలా ఉన్నావు? హృదయంగానే ఉన్నావు. గాఢనిద్రలో నేను లేనని ఎవడూ చెప్పడు. గాఢనిద్రలో నువ్వు ఎలా ఉన్నావు? హృదయంగా ఉన్నావు. కానీ ఏమనుకుంటున్నావు? గాఢనిద్ర ఏమో నిజం కాదు అనుకుంటున్నావు, మెలకువ నిజం అనుకుంటున్నావు, ఈ శవం నిజం అనుకుంటున్నావు, నువ్వు చనిపోవటం నిజం అనుకుంటున్నావు, ఈ లోకం నిజం అనుకుంటున్నావు. ఇదంతా నిజం వలె కనిపిస్తోంది అంటే నిజం కాని ఈ నేనుని నువ్వు నిజం అనుకుంటున్నావు అంటే ఈ చిన్న తప్పు వల్ల ఎన్నో పొరపాట్లు వస్తున్నాయి అంటున్నారు ఇక్కడ, ఏమి టీచింగ్ చూడండి, అద్భుతమైన టీచింగ్.

మనం చేసింది చాలా చిన్న తప్పు కానీ చూస్తే చాలా పెద్ద శిక్ష పడుతోంది. మనం చేసింది రూపాయి దొంగతనమే కానీ శిక్ష మటుకు ఉరిశిక్ష వేసేశారు మనకి, మీ హృదయంలో ఉన్న ఆనందం మీకు తెలియటం లేదు, అదే ఉరిశిక్ష. మీ హృదయంలో ఉన్న శాంతి, మీ హృదయంలో ఉన్న ఆనందం, మీ హృదయంలో ఉన్న దేవుడు మీకు తెలియటం లేదు కదా, ఆ తెలియకపోవడమే హత్య, తెలియకపోవడం అంటే నిన్ను నువ్వు హత్య చేసుకుంటున్నావు అన్నమాట. తెలియకపోవటమే హత్య. ఆత్మ మనకి తెలియకపోవటమే ఆత్మహత్య. ఇక్కడ భగవాన్ ఎలా చెబుతున్నారో చూడండి. ఇది బాగా అర్థం చేసుకోండి. నువ్వు గాఢనిద్రలో ఉన్నావు, గాఢనిద్రలో నేను లేనని ఎవరైనా చెబుతారా? అప్పుడు ఎలా ఉన్నావు? హృదయంగా ఉన్నావు. అంటే తలంపు లేనప్పుడు కూడా అది ఉంది. అయితే

నువ్వు ఏమనుకుంటున్నావు? గాఢనిద్రలో నువ్వు ఉన్నావు చూశావు అది అబద్ధం అనుకుంటున్నావు. ఈ శరీరం ఒకటి, ఈ లోకం ఒకటి నిజం అనిపిస్తుంది. నిజం కానిది నిజం వలె నీకు ఎందుకు అనిపిస్తుంది అంటే, నేను అనే బుద్ధి నీకు ఉంది కదా, ఆ నేను అనే బుద్ధి నిజం కాదు కాబట్టి నిజం కాని ఈ గొడవలు అన్నీ నిజం వలె నీకు అనిపింపచేస్తుంది అంటున్నారు. ఇది ఇక్కడ లాజిక్.

ఏదైతే ఇప్పుడు నేను నేను అంటున్నావో ఆ నేను అనే బుద్ధి నీకు గాఢనిద్రలో లేదు. గాఢనిద్ర లోంచి మెలకువలోకి వచ్చాక నేను అనే బుద్ధి వస్తుంది. ఆ నేను అనే బుద్ధిని నువ్వు అనుకుంటున్నావు? అది నిజం కాదు. ఆ నేను అనే బుద్ధి నిజం అయితే గాఢనిద్రలో కూడా అది ఉండాలి. కానీ ఆ నేను అనే బుద్ధి వచ్చాక నీకు దేహం వస్తుంది, లోకం వస్తుంది, చావు వస్తుంది, పుట్టుక వస్తుంది, పుణ్యం వస్తుంది, పాపం వస్తుంది, మంచి వస్తుంది, చెడ్డ వస్తుంది, స్వర్గం వస్తుంది, నరకం వస్తుంది, అన్నీ వస్తున్నాయి కదా, ఇదే సంసారం అంటే. సంసారం అంటే ఇంట్లో మనుషులు కాదు చావటం, పుట్టడం సంసారం. దేహం నిజమే, లోకం నిజమే, మెలకువ నిజమే, నిద్ర మటుకు అబద్ధం అని నీకు ఏది అనిపిస్తుంది అంటే, ఈ నేను అనే బుద్ధి అలాగ అనిపింపజేస్తుంది. దేహగతమైన నేనే నీకు నిజం కాని మెలకువని, నిజం కాని ప్రపంచాన్ని, నిజం లాగ నీ చేత అనిపింపచేస్తుంది.

లోకం సత్యమా, అసత్యమా అని భగవాన్‌ని అడిగారు. భగవాన్ సమాధానాలు ఎలాగ ఉంటాయంటే ఆయన బరువేమి మోయరు, ఏదైనా పనిముట్టును ఎంతవరకు కావాలో అంతవరకు ఉపయోగించుకుని పక్కన పెట్టేస్తారు. కఠోపనిషత్తులో ఇలా ఉంది, భగవద్గీతలో రెండో అధ్యాయంలో ఇలా ఉంది, పద్దెనిమిదో శ్లోకంలో ఇలా ఉంది అని చెప్పరు. ఈ మోతగాళ్ళు అందరూ ఎటువంటివారు అంటే, గాడిద మంచి గంధపు చెక్కలు మోయడానికి పనికివస్తుంది కానీ దాని వాసన అది అనుభవించదు. అయ్యో మంచి గంధపు చెక్క ఇంత వాసన వస్తోంది కదా అని ఆ వాసన మటుకు గాడిద అనుభవించదు. చాలామంది పండితులు అంతే, గాడిద మోసినట్టు శ్లోకాలను మోసుకుని వస్తూ ఉంటారు మీ దగ్గరకి, లోపల ఏముందో వారికి తెలియదు.

ఒకసారి భగవాన్ దగ్గర ఎవరో వేదం చదువుతున్నారు. ఆ పక్కన ఉన్న పండితుడు అన్నాడు వాడు వేదం చదువుతున్నాడు, వాడు చదివినది వాడికే తెలియటం లేదు అన్న సంగతి నాకు తెలుస్తోంది అంటున్నాడు. అప్పుడు భగవాన్ ఏమన్నారు అంటే, భగవాన్ లో ఉన్న సూక్ష్మబుద్ధి చూడండి. వాడు చదివే పని చేస్తున్నాడు నువ్వు అర్థం చేసుకునే పని చెయ్యరా అన్నారు. పోనీ చదివే పని ఏదో వాడు చేస్తున్నాడు. వాడికి అర్థం అవ్వడం లేదు అని నీ గోల ఏమిటి? అర్థం చేసుకునే పని నువ్వు చెయ్యి. వాడికి చేతకాదు అంటున్నావు కదా, వాడికి చేతకాని పని ఏదో నువ్వు చెయ్యి, అంటే భగవాన్‌కి మోత పని అంటే ఇష్టం ఉండదు. అసలే సంసారం బరువులు మొయ్యలేకపోతే ఇంక పుట్టటాల గొడవ ఎందుకు అనేవారు. అది మోత. ఈ పుస్తకంలో ఇలా ఉంది, ఆ పుస్తకంలో అలా ఉంది అని చెప్పే అలవాటు ఆయనకు లేదు. ఆయన experience లోంచి తీసి ఇవ్వటమే. నేను అనే బుద్ధి కనుక బయట నుంచి వస్తోంది అనుకోండి, గురువు ఏమి చేస్తాడు అంటే ఫలానా చెట్టు కొమ్మ లోంచి వస్తుంది అని తీసుకెళ్ళి మనకి చూపిస్తాడు. చేతితోటే చూపించవచ్చు అది బయట నుంచి వస్తుంటే, కాని బయట నుంచి రావడం లేదు, అది లోపల నుంచే వస్తోంది. బాగా అర్థం చేసుకోండి, అది farmless, Farmless అని అది అసలు లేదు అనడానికి వీలు లేదు. కరెంటు మన కళ్లకి కనపడడం లేదు మరి లేదంటే ఎలా? లోకం సత్యమా? అసత్యమా? అని ఒకరు అడిగారు. అంటే భగవాన్ సత్యం అని చెప్పలేదు, అసత్యం అని చెప్పలేదు. ఆయన ఏమన్నారు అంటే ఇప్పుడు నువ్వు నేను నేను అంటున్నావు కదా ఆ నేను ఎంత సత్యమో, లోకం కూడా అంతే సత్యం అని చెప్పారు.

దేవుడు ఉన్నాడా? లేడా? అనేదిప్రశ్న. ఉన్నాడని చెప్పలేదు ఆయన, లేడని చెప్పలేదు. ఇటువంటి వివాదాలలోకి గౌతమబుద్ధుడు ఒకడు, రమణమహర్షి ఒకడు, వీళు



**నీ ప్రయత్నం తోటి ఇసుమంతయు, చింతాకంతయు కూడా సంబంధం లేకుండా, నీ మనస్సు యొక్క చాపల్యం ఎవరి సమక్షంలో ఆగిపోతోందో వాడే గురువు.**

ళ్ళ ఇద్దరూ రాలేదు. అంటే కలియుగంలో కలహాలు ఎక్కువ అని. మనం మంచిగా మాట్లాడినా కానీ, ప్రేమగా మాట్లాడినా కానీ కలహాలు పెట్టేవాళ్ళు ఉంటారు. సహృదయంతోటి మాట్లాడినా, మన సహృదయాన్ని అర్థం చేసుకునే బుద్ధి లేకపోతే అది కలహం కింద మారిపోతుంది. కలియుగంలో మనుషులు కలహ ప్రియులు. కొంతమంది మాట్లాడమంటే పోట్లాడతారు, మాట మొదలుపెట్టేటప్పటికి పోట్లాడినట్టు ఉంటుంది. మాటల్లో సున్నితత్వం ఉండదు, సంస్కారం ఉండదు.

కృష్ణుడు గీతలో ఏమని చెప్పాడు అంటే వాక్కు తపస్సు నేర్చుకోండి అన్నాడు. మీరు ఏదైనా మాట్లాడుతుంటే ఇతరులకి శాంతి, సుఖం కలుగజేసేలా ఉండాలి. అది నీకు సుఖం కలుగజేయాలి, ఎదుటి మనిషికి సుఖం కలుగజేయాలి, అది మితంగా ఉండాలి, హితవుగా ఉండాలి. ఆ మాట ఇతరులకి శ్రేయస్సు కలిగేలా ఉండాలి. ఇతరులకి ఏదైనా దుఃఖం ఉంటే, ఏదైనా ఆవేదన ఉంటే అది చల్లబర్చాలి. మీ మాట శాంతి కలిగేలా ఉండాలి. సందర్భం లేకుండా మనం మాట్లాడకూడదు. వాక్కు తపస్సుని మీరు ప్రాక్టీస్ చెయ్యండని భగవద్గీతలో చెప్పాడు. వాక్కు తపస్సు కూడా మనకు బ్రహ్మానుభవం కలగడానికి, బ్రాహ్మీస్థితిని అలంకరించడానికి అది మనకి సహకరిస్తుంది. దేవుడు సత్యమా, దేవుడు అసత్యమా, లోకం సత్యమా, లోకం అసత్యమా అంటూ వివాదాలలోకి దిగకూడదు.

గౌతమబుద్ధుడిని, రమణమహర్షిని కొంతమంది ఏమంటారు అంటే వారు ముసుగు వేసుకున్న నాస్తికులు అంటారు. వాళ్ళు నాస్తికులే కానీ నాస్తికులు అని లోకానికి కనపడకుండా ముసుగు వేసుకున్నారు అంటారు. అంటే వాళ్ళ ఉద్దేశ్యం అది కాదు. నీకు సుఖం లేనప్పుడు, నీకు శాంతి లేనప్పుడు, నీకు ఆనందం లేనప్పుడు దేవుడు ఉన్నాడు అంటే ఏముంది, లేడు అంటే ఏముంది. దేవుడి తోటి సంబంధం లేకుండా డైరెక్ట్‌గా నీ హృదయంలో ఉన్నటువంటి శాంతిలోకి, సుఖంలోకి, ఆనందసముద్రంలోకి, సుఖసముద్రంలోకి దేనిని మధ్యవర్తిగా పెట్టకుండా, డైరెక్ట్‌గా సుఖసముద్రంలోకి తీసుకెళ్ళి జీవుడిని ప్రవేశ పెట్టడం కోసమే గౌతమబుద్ధుడు, రమణమహర్షి ఎక్కువ ఉపదేశించారు. రమణమహర్షి, గౌతమబుద్ధుడు బాహ్యంగా జరిగే మహిమలకి ఏమీ ప్రాముఖ్యత ఇవ్వలేదు. ఎందుచేత

అంటే మనస్సు ఎంత నిజమో, మహిమలు కూడా అంతే నిజం.

స్వామి వివేకానంద ఏమి చెప్పారు అంటే ఈ మహిమల వల్లే దేశం పాడైపోయింది, అంటే కష్టపడి పనిచేయటం మానేసి ఏదో మహిమలు చేస్తే మనకి వచ్చేస్తుంది అనుకునే ఇటువంటి సోమరితనాన్ని దేశానికి అలవాటు చేశారు అన్నారు. కష్టం మీద, పని మీద గౌరవం చెడగొడుతున్నారు అన్నారు. ఒక పటం ఉంది, ఆ పటం లోంచి నీళ్ళు వచ్చేస్తున్నాయి, దానివల్ల మీరు పొందేది ఏమిటి? మీ దుఃఖం నశించిందా? మీ చైతన్యస్థాయి ఏమైనా పెరిగిందా? మీ అలవాట్లలో ఏమైనా మార్పులు వచ్చాయా? ఒక పటం లోంచి నీళ్ళు వచ్చేస్తున్నాయి దానివల్ల మీరు ఏమైనా బాగుపడ్డారా? ఇది స్వామిజీ అడిగేది. ఆ తాటిచెట్టు మాట్లాడేస్తుంది, ఏమిటి విశేషం? అదే మతం అనుకోవడం, అదే దేవుడు అనుకోవటం. మాట్లడేసింది అనుకోండి తాటిచెట్టు, మీకు ఏమైనా జ్ఞానం వచ్చిందా? మీకు ఏమైనా దుఃఖం నశించిందా? మీకు ఏమైనా చైతన్యస్థాయి పెరిగిందా? దీనివల్ల కలిసి వచ్చేది ఏమి లేదు. తాత్కాలికంగా ఇవన్నీ ఆకర్షణకి ఉపయోగపడతాయి కానీ మూలంలో మటుకు మీ అహంవృత్తి నశించిందా? మీ చైతన్యస్థాయి పెరగకుండా మటుకు మీరు జ్ఞానులు కాలేరు, మహిమలు వల్ల మీరు జ్ఞానులు కాలేరు. ఇటువంటి గొడవల తోటి సంబంధం లేకుండా, ఇటువంటి ప్రక్రియల తోటి సంబంధం లేకుండా డైరెక్ట్‌గా, నీ సోర్స్ లోకి నిన్ను పంపడానికి గౌతమబుద్ధుడు ఎక్కువ ప్రయత్నం చేశాడు. మనం బాగా చీకట్లో ఉన్నాం అనుకోండి, దారి తెలియటం లేదు అనుకోండి, ఒకడు వెలుతురు చూపించాడు అనుకోండి, ఆ వెలుతురు చూపించిన వాడి పట్ల మనకి ఎలా ఉంటుంది? అలాగే గౌతమబుద్ధుడిని కూడా లైట్ లాంటివాడు అంటారు.

బ్రహ్మానుభవాన్ని పొందడం కోసం హేతువాదాన్ని విడిచి పెట్టక్కర్లేదు, commonsenseని విడిచి పెట్టక్కర్లేదు. మీకు ఏది కావాలో, మధ్యవర్తుల తోటి పని లేకుండా, డైరెక్ట్‌గా నిన్ను అక్కడకి పంపడానికి చూశాడు బుద్ధుడు ఒకడు, రమణాచార్యుడు ఒకడు. గమ్యం నీకు చూపించి, ఆ గమ్యం వైపు నిన్ను ఆకర్షింపచేసి, ఆ గమ్యం యొక్క importance నీకు తెలపడానికి ప్రయత్నం చేశాడు వాడే బుద్ధుడు. అంటే గమ్యం చూపిస్తూ, మీ చేత నడిపిస్తూ, ఆ గమ్యం

యొక్క importance చెబుతూ, అందులో sweetness చెబుతూ, మీచేత నడిపించాడు. హృదయం అంటే ఊహ కాదు, అది మీ తలంపు కాదు. శరీరం కూడా ఒక తలంపే, కానీ ఆ హృదయం మటుకు అది తలంపు కాదు. ఎందుచేత? నీకు శరీరం లేనప్పుడు, నీకు తలంపులు లేనప్పుడు, నీకు దేహబుద్ధి లేనప్పుడు, నీకు లోకం లేనప్పుడు, ఆ క్రియేటర్ గొడవ లేనప్పుడు, క్రియేషన్ గొడవ లేనప్పుడు కూడా అది తలంపుల తోటి, నీ ఊహల తోటి, నీ సంకల్పాల తోటి సంబంధం లేకుండా అది ఉంది. మీకు తలంపులు ఉన్నప్పుడు అది ఉంది, తలంపులు లేనప్పుడు అది ఉంది, మీరు చింపేస్తేపోయేది కాదు అది. దాని existence నువ్వు అంగీకరించనంత మాత్రం చేత అది లేకుండా పోదు. ఉన్నదేదో ఉంది, లేనిదేదో లేదు.

ఈమధ్య ఒక జడ్జీగారు నా దగ్గర భగవద్గీత నాకు చదవాలి అనిపించటంలేదు అన్నారు. ఎందుకు అని అడిగాను. గీతలో చెప్పిందే మళ్ళీ చెబుతూ ఉంటాడు, కృష్ణుడు దేవుడు అంటారు మళ్ళీ చెప్పిందే చెబుతాడు ఏమిటి అన్నారు. చెప్పిందే చెప్పటం కాదు మీ బుర్రకి తట్టడం కోసం, ఉదాహరణ మార్చి చెబుతూ ఉంటాడు. అన్నీ చెప్పడు, కొన్ని కొన్ని విషయాలు మార్చి repeatedగా ఎందుకు చెబుతాడు అంటే మీ బుద్ధికి పట్టడం కోసం అలా చెపుతాడు. కృష్ణుడు ఎన్నిసార్లు చెప్పినా నా బుద్ధికి తట్టడం లేదు అన్న సంగతి ఆ జడ్జీగారికి తెలియటం లేదు కానీ వాడు పదిసార్లు చెప్పాడు అంటారు. కృష్ణుడు ఎన్నిసార్లు చెప్పినా మన బుద్ధికి తట్టడం లేదు అన్న బాధ ఈయనకి లేదు.

అష్టావక్రుడు జనకమహారాజు సభకి వచ్చాడు, అష్ట వంకరల తోటి ఉన్నాడు. ఆయనని చూడగానే జనకమహారాజు ఆస్థానంలో ఉన్న మంత్రులు అందరూ ఒక్కసారి నవ్వారు. అంటే అన్ని వంకరల తోటి ఉన్నాడు అష్టావక్రుడు. వీళ్ళు అందరు నవ్వితే అష్టావక్రుడు కూడా నవ్వాడు. జనకమహారాజుకి ఆశ్చర్యం వేసింది. ఏవయ్యా! నిన్ను చూసి వాళ్ళు నవ్వారు అనుకో, వాళ్ళని చూసి నువ్వు నవ్వుతున్నావు ఏమిటి అన్నారు అష్టావక్రుడిని జనకమహారాజు, అప్పుడు అష్టావక్రుడు జనకమహారాజు తోటి ఇటువంటి మూర్ఖులను దగ్గర పెట్టుకుని నువ్వు పరిపాలన ఎలా చేస్తున్నావు అని నాకు నవ్వు వచ్చింది అన్నాడు. నీ మంత్రులు శుద్ధ మూర్ఖులు. వారు శరీరాన్ని చూస్తున్నారు కానీ తత్వాన్ని చూడడం లేదు, వాళ్ళు మూర్ఖులు అని తెలుస్తోంది.

వీళ్ళకి చర్మదృష్టే, ఆత్మదృష్టి ఏమి లేదు. చర్మదృష్టి ఉన్నవాళ్ళు చండాలురు. అందుచేత ఇటువంటి మూర్ఖులని నువ్వు కూడా పెట్టుకుని రాజ్యాన్ని పరిపాలన చేస్తున్నావు అంటే నాకు నవ్వు వస్తోంది. అందుకు నేను నవ్వాను అన్నాడు. ఇంక వీళ్ళు అందరికీ నవ్వు ఆగిపోయింది. వీళ్ళకు జ్ఞానం లేదని తెలుస్తోంది. ఈ జ్ఞానం లేని వాళ్ళ సలహాలు తీసుకొని దేశ పాలన చేస్తున్నావా అని అష్టావక్రుడు అడిగాడు.

ఉన్నది ఆత్మే. రమణమహర్షి గారు చెప్పినా అసలు సత్యం అదే. డైరెక్ట్‌గా దానిని ధ్యానం చెయ్యడానికి దానికి రూపం లేదు, దానికి నామం లేదు. ఒక రూపం తోటి, ఒక నామం తోటి కలిసి నువ్వు ఉంటున్నావు. అసలు వస్తువుకి రూపం లేదు, నామం లేదు. ఆత్మను ధ్యానం చేయటం అసాధ్యం అని నీకు చెప్పడం లేదు కానీ అది కష్టం. ఏదో ఒక అవతారపురుషుడినో, మహాగురువునో, మహాజ్ఞానినో, ధ్యానం చెయ్యడం మంచిది అని 12వ అధ్యాయంలో గీతలో చెప్పాడు. అంటే నిరాకారాన్ని ధ్యానం చెయ్యడం కంటే సాకారాన్ని ధ్యానం చెయ్యడం మంచిది. నువ్వు ఏదో దేహానికి పరిమితం అయ్యి ఉన్నావు కదా, అంటే ఎవడో దేహం ధరించిన దేవుడిని, ఒక సాకారాన్ని కనుక నువ్వు ధ్యానం చేస్తే అది తేలిక అవుతుంది అని చెప్పారు.

కొంతమంది ఎంత అహంభావపూరితంగా ఉంటారు అంటే మనం చచ్చిపోతే తూర్పున సూర్యుడు ఉదయించడేమో ఒకవేళ ఆగిపోతాడేమో అనుకుంటారు. అంటే ఈ ప్రపంచం అంతా వాళ్లభుజాల మీద మోస్తున్నట్టు వాళ్ళు అనుకుంటూ ఉంటారు. మనం చచ్చిపోతే ఈ సృష్టి అంతా ఆగిపోతుంది అనుకుంటారు. నువ్వు పుట్టక ముందు ఈ లోకం ఉందిరా, నువ్వు చచ్చాక కూడా ఈ లోకం ఉంటుంది. నువ్వు పుట్టకముందు ఈ లోకాన్ని ఎవడు చూశాడో, నువ్వు చచ్చాక కూడా వాడే చూస్తాడు. వాడికేమి చావు గొడవ లేదు అంటారు రమణాచార్యుడు. నువ్వు చచ్చిన తరువాత ఈ లోకం ఏమవుతుంది అనుకున్నప్పుడు నువ్వు పుట్టకముందు కూడా ఈ లోకం ఉంది కదా, అప్పుడు ఎవడు చూశాడో తరువాత కూడా వాడే చూస్తాడు. కానీ ఇలా అనుకోవటానికి కారణం నీ కర్తృత్వబుద్ధి.

దీనికి రాజగోపాలాచార్యులు ఒక ఉదాహరణ చెప్పారు. ఒక దేవుడిని ఆరాధిస్తూ

మనం తరించడం ఎటువంటిది అంటే నదిలో ఒక నావ మీద కూర్చుని ఈ వైపు ఒడ్డు నుంచి ఆ వైపుకి వెళ్ళడం లాంటిది. ఆత్మని ధ్యానం చేసి తరించడం ఎటువంటిది అంటే, ఈ పక్కన నదిలో ఉరికేసి ఈదుకుంటూ ఆ పక్క ఒడ్డుకి వెళ్ళిపోవటం. ఈత కొట్టుకుంటూ వెళ్ళడం అనేది ఆత్మజ్ఞానం. ఒక నావలో కూర్చుని ఈవైపు నుంచి ఆవైపుకి వెళ్ళడం అనేది ఒక అవతార పురుషుడిని ధ్యానం చేసి వెళ్ళడం లాంటిది. ఇలా అయినా తరించవచ్చు, అలా అయినా తరించవచ్చు. మీరు నావలో ప్రయాణం చెయ్యడం కొంచెం తేలిక. ఈదుకుంటూ వెళ్ళడం కంటే నావలో వెళ్ళడం మీకు safe side అని ఆచార్యుల వారు చెప్పారు. ధ్యానం చెయ్యగా, చెయ్యగా ఆ ధ్యానవస్తువు మనం అయిపోతాం. అలాగే మంచివాళ్ళని ధ్యానం చెయ్యండి, మంచివాళ్ళని ధ్యానం చెయ్యగా, చెయ్యగా ఆ మంచితనం మీకు కూడా వచ్చేస్తుంది. అంటే మీరు ఏదైతే ధ్యానం చేస్తున్నారో అది మీరు అయిపోతారు. హృదయంలో ధ్యానం చెయ్యగా, చెయ్యగాఏదైతే ధ్యానం చేస్తున్నారో అది కరిగిపోయి హృదయాకారం చెందుతుంది. అప్పుడు నీ దేహం దేవాలయం అయిపోతుంది.

మీరాబాయి అనేక కష్టాలు పడింది, కృష్ణుడి రూపాన్ని ఆరాధించింది. కృష్ణుడి నామాన్ని స్మరించింది. మీరాబాయి బంధువుల ద్వారా, కుటుంబం ద్వారా ఎన్ని కష్టాలు పడింది అంటే మనం నిప్పు మీద చెయ్యి పెడితే దాని బర్నింగ్ ఎలా ఉంటుందో, ఆ మంట ఎలా ఉంటుందో, అన్ని రకాల కష్టాలు మీరాబాయి పడింది. అన్ని కష్టాలు పడ్డప్పటికీ మీరాబాయికి అవి కష్టాలు కింద అనిపించలేదు. కారణం ఏమిటి అంటే కృష్ణుడు యొక్క సపోర్ట్. అంటే కృష్ణుడు యొక్క ధ్యానం, కృష్ణుడు యొక్క స్మరణ. కష్టం కష్టంలాగ మీరాబాయికి అనిపించలేదు. కొంతకాలం మధురలో ఉంది, తరువాత ద్వారక వెళ్ళిపోయింది, అక్కడకి వెళ్ళిపోయిన తరువాత బంధువులు అందరూ మళ్ళీ కబురు పెట్టేవారు. పూర్వం నిన్ను అగౌరవం చేసిన మాట నిజమే, ఇప్పుడు మర్యాదగా చూస్తాం, గౌరవంగా చూస్తాం. మళ్ళీ ఇంటికి వచ్చేయమని పెద్దమనుషుల చేత, మధ్యవర్తుల చేత కబురు పంపించారు. అప్పుడు మీరాబాయి ఏమంది అంటే నేను ఏ ఇంటికి వెళ్ళాలి? శరీరానికి సంబంధించిన ఇంటికి వెళ్ళాలా? లేకపోతే నిజమైన ఇంటికి కృష్ణుడులోకి వెళ్ళిపోవాలా? ఏ ఇంటికి వెళ్ళాలి అని ప్రశ్నించినప్పుడు ఆవిడ శరీరంతో సహా ద్వారక

కృష్ణుడిలో ఐక్యం అయిపోయింది. ఆవిడ శరీరం శవం అవ్వలేదు, ఆవిడ శరీరంతో సహా ద్వారక కృష్ణుడిలో ఐక్యం అయింది. ఇంటికి రమ్మని కబురు పంపారు. ఏ ఇంటికి వెళ్ళాలి? మన ఇంటికి వెళ్ళాలా? మన ఇల్లు అంటే బ్రహ్మం, దేవుడు. ఆ ఇంటికి వెళ్ళాలా? దేహానికి సంబంధించిన ఇంటికి వెళ్ళాలా? అని ప్రశ్న వచ్చింది. ఆవిడ దేవుడి ఇంటికి వెళ్ళిపోయింది. ఇది బాగా అర్థం చేసుకోండి.

దేహం చనిపోయినప్పుడు మనసు బాధ పడుతుంది, లోకం కనిపించకపోతే మనసు బాధపడుతుంది. మనోమూలం నీకు తెలిసినప్పుడు దేహం ఉన్నా ఒకలాగే ఉంటావు, లేకపోయినా ఒకలాగే ఉంటావు. ప్రపంచం కనిపించినా ఒకలాగే ఉంటావు, ప్రపంచం కనిపించకపోయినా ఒకలాగే ఉంటావు. ఎందుచేత? మనసు అణిగినప్పుడు మనసు కల్పించిన దేహం, లోకం కూడా అణిగిపోతుంది. అప్పుడు దేహం కనిపించినా ఒక్కటే, కనిపించకపోయినా ఒక్కటే. మనస్సు యొక్క మూలం తెలిసినవాడు మరణాన్ని జయిస్తాడు, వాడిని మరణం ముట్టుకోదు. ఎందుచేత? మనస్సు యొక్క మూలంలో మరణంలేని స్థితి ఉంది. ఆ మరణంలేని స్థితి వాడికి ఎలా వ్యక్తం అవుతుంది? తానుగా వ్యక్తం అవుతుంది. అందుచేత వాడికి దేహం కనిపించినా ఒక్కటే, కనిపించకపోయినా ఒక్కటే. ప్రపంచం కనిపించినా ఒక్కటే, కనిపించకపోయినా ఒక్కటే. ఇప్పుడు మనకి ప్రపంచం కనిపించకపోతే, దేహం కనిపించకపోతే దుఃఖం వస్తుంది, ఇది బాగా అర్థం చేసుకోండి. ఇది మాములుగా ఊహ కాదు, దేహం కనిపించకపోయినా, లోకం కనిపించకపోయినా, దేవుడు కనిపించకపోయినా, తన అస్థిత్వానికి భంగం లేదు అన్న సంగతి మైండ్ యొక్క సోర్స్ తెలిసినవాడికి తెలుస్తూ ఉంటుంది. సబ్జెక్టు బాగా అర్థం చేసుకోవాలి మీరు. దేహం కనిపించకపోయినా, దేవుడు కనిపించకపోయినా, లోకం కనిపించకపోయినా, తన అస్థిత్వానికి భంగం లేదు అన్న సంగతి వాడికి స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది అందుచేత వాడికి దుఃఖం రాదు. కామానికి కారణం ఉంటుంది, ప్రేమకి కారణం ఉండదు. రమణమహర్షి గారికి అరుణాచలేశ్వరుడు తనకంటే వేరుగా లేడన్న సంగతి తెలుసు. కానీ అరుణాచలేశ్వరుడి మీద ప్రేమ పోలేదు, అది ప్రేమంటే, తనకంటే దేవుడు వేరుగా లేడన్న సంగతి ఆయనకి

తెలుసు. తెలిసినా కూడా ఆయనకి ప్రేమ పోలేదు. దేవుడిని కూడా మనం ప్రేమిస్తున్నాం, ఎలా ప్రేమిస్తున్నాం? దేవుడు మనకంటే వేరుగా ఉన్నాడు అనుకుని ప్రేమిస్తున్నాం. కానీ రమణమహర్షి గారికి దేవుడు తనకంటే వేరుగా లేడన్న సంగతి ఆయనకి తెలుసు. తెలిసుండి కూడా దేవుడిని ఆయన ప్రేమిస్తున్నాడు, అది నిజమైన ప్రేమ.

రమణమహర్షి గారికి శివుడి మీద ఎప్పుడూ జనకభావన ఉండేది. శివుడు అంటే దేవుడు జ్ఞాపకం వచ్చేవాడు కాదు, నా తండ్రేఅని జ్ఞాపకం వచ్చేవాడు, ఆ పూర్వజన్మ సంబంధం ఏమిటో మరి. శివుడు అనేటప్పటికి మనకి ఎవడు జ్ఞాపకం వస్తాడు? దేవుడు జ్ఞాపకం వస్తాడు, అంతేకదా. ఆయనకి మటుకు దేవుడు జ్ఞాపకం వచ్చేవాడు కాదు నా ఫాదర్ అనుకునేవాడట. అంటే ఈయనకి చిన్నప్పటి నుంచి కూడా శివుడి పేరు చెప్పేటప్పటికి జనక భావన ఉండేది. ఆయన పుట్టిన క్షేత్రం శివక్షేత్రం. ఆయన ఉపదేశం చేసినటువంటి అరుణాచలం కూడా శివక్షేత్రం. ఆ ఊరి పేరు అరుణాచలం, దేవుడి పేరు అరుణాచలం, కొండ పేరు అరుణాచలం. అరుణాచలం ఎవరి గర్వాన్ని అణచడానికి వచ్చింది? విష్ణుదేవుడి యొక్క, బ్రహ్మదేవుడి యొక్క గర్వాన్ని అణచడానికి వచ్చింది. ఎవరైతే అరుణాచలం, అరుణాచలం అనిస్మరిస్తున్నారో, వాడికున్న గర్వాన్ని వాడికి తెలియకుండానే వాడు తీసేస్తాడు. ఆ క్షేత్రం ఆవిష్కరించడానికి కారణం అదే. అంటే గర్వభంగం చెయ్యడానికి, అహంభావాన్ని తొలగించడానికి వెలసినటువంటి క్షేత్రం అరుణాచలం. అహంభావన లేని స్థితి ఎలా ఉంటుందో, అహంభావన ఉన్నవాడికి తెలియదు.

రమణమహర్షి గారు అహంభావన లేని స్థితి మనకి చెబుతున్నారు అనుకోండి వింటున్నాం. కానీ రుచి తెలియడం లేదు. ఆ మాటలు వింటున్నాం కానీ ఆ రుచి తెలియడం లేదు, ఆ లోతులు తెలియడం లేదు, అందులోని అందాలు తెలియడం లేదు, వినడం వింటున్నాం. ఎందుచేత అంటే మనది తప్పు కాదు. అసలు ఆ స్టేట్ ఎలా ఉంటుందో మన imagination కి అందదు. వినడం మటుకు వింటున్నాం. రమణమహర్షి గారికి జ్ఞానం కలిగింది, జ్ఞానం కలిగింది అని మనం అనుకుంటున్నాం కదా, ఆయన ఏమంటున్నాడు? ఎవరి అనుగ్రహం వల్ల నాకు జ్ఞానం కలిగిందో, వాడి అనుగ్రహం వల్ల

నీకు కూడా కలుగుతుంది. ఇందులో నా ప్రమేయం ఏముంది అన్నాడు. ఇద్దరు ఉంటే వాడు ఎక్కువ, వీడు తక్కువ అనుకోవచ్చు, ఉన్నది ఒక్కటే. ఉన్నది ఒక్కటే అయినప్పుడు ఎక్కువ ఏమిటి, తక్కువ ఏమిటి? ఉన్న వస్తువు ఒక్కటే, అందులో ఎక్కువ, తక్కువ ఏమిటి అసలు. దేవుడు సమానంగా ఉంటాడు కాబట్టి ఆ సమానబుద్ధి ఎవడైతే పొందాడో, వాడిని మాత్రమే దేవుడు తనలో ఐక్యం చేసుకుంటాడు.

కృష్ణుడు ఏమని చెప్పాడు అంటే సమత్వబుద్ధి ఉన్నవాడు యోగి అని గీతలో చెప్పాడు. సూక్ష్మబుద్ధి అణుగుతుంది కానీ స్థూలబుద్ధి అణగదు. సూక్ష్మబుద్ధి గ్రహించినట్టు స్థూలబుద్ధి గ్రహించదు. రామకృష్ణపరమహంస గారు ఏమన్నారు అంటే, బాగా ఎండిపోయిన పుల్ల అలా నిప్పు పెట్టేటప్పటికి అంటుకుపోతుంది, సూక్ష్మబుద్ధి అటువంటిది. కొన్ని పుల్లలు తడిసిపోయి ఉంటాయి, అగ్గిపెట్టిలో అగ్గిపుల్లలన్నీ అయిపోయినా ఆ పుల్ల వెలగదు. స్థూలబుద్ధి ఉన్నవాళ్ళు అంతా కూడా తడిసిపోయిన పుల్లలు లాంటివాళ్ళు. తడిచిపోయిన పుల్లని వెలిగించడం ఎంత కష్టమో, ఈ likes, dislikes తో కొట్టుకుపోతున్న మనుషులకి జ్ఞానం కలగడం కూడా అంతే కష్టం. మనం శివుడి యొక్క రూపాన్ని ఆరాధించగా, ఆరాధించగా, ఏది నిజమో మనకి తెలియకపోయినా ఆయనకి తెలుసు కాబట్టి నిజాన్ని మనకి ఇచ్చేవరకు ఆయన మనలని విడిచిపెట్టడు. వాడు దేవుడు.

కృష్ణుడు నాకు పుష్పం ఇవ్వండి, ఫలం ఇవ్వండి అని అడిగాడు దాని అర్థం ఏమిటి అని అడిగారు. దాని అర్థం ఏమిటి అంటే, ఇవ్వడం నేర్పటం. ఫలం ఇచ్చాం అనుకోండి మనం, పుష్పం ఇచ్చాం అనుకోండి, అంటే అది ప్రేమకి గుర్తు. ఆయన మీద మనకి ఇష్టానికి గుర్తు. అంటే ఏమిటి? పత్రం, పుష్పం ఇవ్వడం అంటే కొంతమందికి ఇచ్చే



**గురువే ఆత్మ, దేవుడే ఆత్మ.**

**ఆత్మ యొక్క స్వరూపమే ఆనందం,**

**దాని స్వరూపమే శాంతి, దాని స్వరూపమే ఉండటం.**

అలవాటు ఉండదు. ఒక పుష్పాన్నే నువ్వు భగవంతుడికి ఇవ్వలేనప్పుడు నీ దేహబుద్ధిని ఎలా విడిచి పెట్టగలవు అంటే ఎప్పటికైనా మన దేహబుద్ధి త్యాగం చేస్తేనే కానీ మనకి ఆత్మబుద్ధి కలగదు. శవబుద్ధి విడిచిపెడితేనే కానీ శివబుద్ధి కలగదు. అందుచేత విడిచిపెట్టటం కోసం, త్యాగం చేయించటం కోసం, నేను, నేను అనే దేహబుద్ధి మనలో నశింపచేయటం కోసం, అంటే ఇవ్వడం అలవాటు చెయ్యడం కోసం, అలా మనకి చెప్పేవారు. పుష్పం ఎక్కడ ఉంది? దేహానికి బాహ్యంగా ఉంది. పండు ఎక్కడ ఉంది? దేహానికి బాహ్యంగా ఉంది. దేహానికి బాహ్యంగా ఉన్న వస్తువు నువ్వు విడిచి పెట్టలేనప్పుడు దేహానికి లోపల ఉన్న నేనుని ఎలా విడిచి పెడతాడు వాడు? విడిచిపెట్టలేడు. దేహానికి వేరుగా ఉన్న వస్తువుని విడిచిపెట్టటం అలవాటు చేస్తే దేహంతో కలిసి ఉన్న నేనుని విడిచిపెట్టే అలవాటు వాడికి వస్తుంది అని ఆ స్థాయికి వాడిని తీసుకొనిపోవటం కోసం, వాడికి త్యాగబుద్ధి కలుగజేయడం కోసం అలా చెప్పారు.

ప్రపంచంలో ఏ పుస్తకానికి లేనటువంటి గౌరవం గీతకి ఉంది. మనుషులకి జన్మదినోత్సవాలు చేస్తారు కానీ పుస్తకానికి ఎవరు జయంతులు చేయరు. కానీ ప్రపంచంలో గీతకి మటుకు జయంతి చేస్తారు దానికి కారణం ఏమిటంటే, అన్ని తరహాల మనుషులకి, అన్ని క్లాసుల మనుషులకి, చైతన్యస్థాయిలో అన్ని రకాల మనుషులకి సంబంధించిన ఉపదేశం అక్కడ ఉంది. గీత సమన్వయ గ్రంథం, ఉపదేశ గ్రంథం. అది సమన్వయము చేశాడు. అంటే సృష్టిలో ఎన్నిరకాల జీవులు ఉంటారో, అన్ని రకాల జీవులని ఆయన దృష్టిలో పెట్టుకుని, తల్లి ప్రేమ కదా, అన్ని దృష్టిలో పెట్టుకుని ఆయన చెప్పాడు. కృష్ణుడు భగవంతుడు కదా, కృష్ణుడు భగవంతుడు అంటే ఆయన మనలాగా జపాలు చేసి, ధ్యానాలు చేసి భగవంతుడు అవ్వలేదు. స్వయంగా దేవుడు. చైతన్యమే కాళ్ళు, చేతులు తొడుక్కుని వచ్చింది. పైనుండికిందకి వచ్చాడు కానీ కింద నుంచి పైకి వెళ్ళలేదు.

గురునానక్ దగ్గరకు ఒక పరమలోభి వచ్చాడు, అంటే హృదయాన్ని కూడా పరమలోభి అని రమణమహర్షి గారు చెప్పారు కదా, అంటే పిసినారివాడు తన ధనాన్ని ఎంత జాగ్రత్తగా చూసుకుంటాడో, హృదయం కూడా వాసనని అంత జాగ్రత్తగా చూసుకుంటుంది అని.

అటువంటి లోభి ఒకడు గురునానక్ దగ్గరకి వచ్చాడు, వాడు పరమలోభి అని ఆయనకు తెలుసు. కృష్ణుడు అడిగినట్టు పుష్పాన్ని, ఫలాన్ని ఇవ్వమని వాడికి గురునానక్ చెప్పలేదు. గురునానక్ వాడితో నువ్వు దగ్గరకు రా అన్నాడు. నువ్వు లోభి అని వాడితో చెప్పలేదు. దగ్గరకురా అన్నాడు. ఆయన దగ్గర గుండుసూది ఒకటి ఉంది. ఈ సూది నువ్వు పట్టుకో అన్నాడు, వాడు పట్టుకున్నాడు. నువ్వు ఏమి చేస్తావు అంటే, సూది నాదే, నీ దగ్గర జాగ్రత్త పెట్టు. నేను బ్రతికుండగా మటుకు ఈ సూది నాకు ఇవ్వద్దు. నేను చచ్చిన తరువాత వైకుంఠానికో, కైలాసానికో ఎక్కడికో ఒక చోటకి వెళతాను కదా, అక్కడకి తెచ్చి ఇవ్వు అని గురునానక్ వాడితో చెప్పాడు. ఏవండీ ఈ సూది అక్కడికి తెచ్చి మీకు ఎలా ఇవ్వగలను అన్నాడు. మరి ఈ ధనం అంతా ఎక్కడకు పట్టుకెళదాం అని దాచుకుంటున్నావు అని అడిగారు. నాకు ఈ సూదే తెచ్చి ఇవ్వలేను అంటున్నావు కదా, మరి ఈ ధనం అంతా ఎక్కడకి పట్టుకుని వెళదాం అనుకుంటున్నావు? గురునానక్ చెప్పేది ఏమిటంటే, ధనాన్ని పాడుచేసుకోమని కాదు వాళ్ళ అంతస్తుకి తగ్గ త్యాగం ఉండాలి. అంటే వాడి డబ్బు అంతా తగలేసుకుని వాడిని దరిద్రుడిని అవ్వమని కాదు గురునానక్ చెప్పేది. నీకు దానగుణం ఉండాలి. ఈ సూది నాకు ఇవ్వలేను అంటున్నావు. నీ డబ్బు అంతా ఎవరికి ఇస్తావు అని అడిగారు. కృష్ణుడు మర్యాదగా చెప్పాడు, వాడికి బండతనంగా చెబితేనే కానీ అర్థం అవ్వదు కాబట్టి వాడికి స్థూలబుద్ధి ఉంది కదా, స్థూలబుద్ధి ఉన్నవాడికి స్థూలబుద్ధి తోటే చెప్పాలి అని నానక్ వాడికి అలా చెప్పాడు.

**అరుణాచల శివ, అరుణాచల శివ, అరుణాచల శివ అరుణాచల**

**ఓం నమోనారాయణాయ, ఓం నమోనారాయణాయ, నారాయణాయ, నారాయణాయ**


**ఓం నమోనారాయణాయ, నారాయణాయ, నారాయణాయ**

**ఓం నమో భగవతే వాసుదేవాయ, వాసుదేవాయ, వాసుదేవాయ**

**ఓం నమో భగవతే వాసుదేవాయ, వాసుదేవాయ, వాసుదేవాయ, వాసుదేవాయ**

**ఓం శాంతిఃశాంతిఃశాంతిః**

# గురువు అంటే ఆత్మ



ప్రియమైన ఆత్మబంధువుల్లారా!

గురువు అంటే ఆత్మ కానీ మనము ఏమని అనుకుంటున్నాము అంటే, గురువు అంటే దేహమే అనుకుంటున్నాము. అది మనం చేస్తున్న పొరపాటు. కానీ గురువు దేహంలో ఉన్నప్పుడు కూడా తాను ఆ దేహం కాదని ఆయనకు తెలుస్తూ ఉంటుంది. తాను దేహ మాత్రుడిని కాదని గురువుకి తెలుస్తూ ఉంటుంది. నువ్వు గురువుని దేహానికి పరిమితం చేస్తావు. కానీ గురువు మటుకి దేహానికి పరిమితం అయ్యి ఉండడు. ఆ దేహంలో ఉన్నప్పుడు కూడా తానెవరో తనకి తెలుస్తూనే ఉంటుంది. తన ఆత్మానుభవం వాడికి ఉండనే ఉంటుంది. ఊరికే దేహం ఒక గుల్ల. బాహ్యమైన గురువు మనసుని బయట నుంచి లోపలకి గెంటుతాడు, లోపల గురువు మనసుని లోపలకి గుంజుకుంటాడు. మనస్సుని చేరదీసుకుని తన స్వరూపం ఇస్తాడు. బయట గురువూ పని చేస్తాడు, లోపల గురువు కూడా పని చేస్తూనే ఉంటాడు. ఇంతకీ మనం అర్థం చేసుకోవలసిన విషయం ఏమిటి అంటే, గురువు దేహం పడిపోయినా గురువు ఆ దేహం కాదు కాబట్టి గురువు తోటి సంబంధం మనకి కంటిన్యూ అవుతూ ఉంటుంది. గురువు అంటే దేహం కాదు, సద్వస్తువే, అంటే ఆత్మే. ఆత్మ అన్నా, గురువు అన్నా, దేవుడు అన్నా ఒక్కటే.

**(సేకరణ : 04 ఫిబ్రవరి 1996, మార్టేరు,**

**సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)**

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# నిజమైన భక్తులు

**గురువు దయ, భగవంతుడి దయ, పొందటానికి నిజమైన భక్తులు ఎలా ఉండాలో, ఏవిధంగా నడుచుకోవాలో శ్రీనాన్నగారు చెప్పిన కొన్ని వాక్యములు.**

కష్టపడి చదువుకోవటం కంటే, డబ్బు సంపాదించటం కంటే, పదవి సంపాదించటం కంటే, సమాజంలో గౌరవం సంపాదించటం కంటే, మంచి బుద్ధి సంపాదించటం కష్టం. భక్తులలో నేను కొంతమంది మంచివాళ్ళని చూసాను. గుడిలోకి వెళ్తారు కాని వాళ్ళ కుటుంబ విషయాలు కాని సమాజం విషయాలు కాని ఏమీ కోరికలు కోరరు. స్వామీ మాకు మంచి బుద్ధిని ప్రసాదించు అని కోరుకుంటారు. అటువంటి భక్తులని చూస్తే నాకు ఏనుగుమీద కూర్చునట్టు ఉంటుంది అన్నారు శ్రీనాన్నగారు. వాళ్ళు ఏమీ అడగరు. అనారోగ్యం తోటి బాధపడుతున్నా కూడా, మాకు ఆరోగ్యం ప్రసాదించు అని అడగరు. ఇంటిదగ్గర తిండికి ఇబ్బంది పడుతున్నారు అనుకోండి, మాకు అన్నవస్త్రాలకి లోటు లేకుండా చేయమని కూడా అడగరు. మాకు మంచి బుద్ధిని ప్రసాదించు అంటారు, అంతే స్వామి దగ్గర ఇంకేమీ అడగరు.

చేతులు కాళ్ళు కూడా లేని ఒక భక్తుడికి భగవంతుడు కనిపించి, నీకు చేతులు కాని కాళ్ళు కాని ఒకటే ఇస్తాను, రెండింటిలో ఒకటి కోరుకో అంటాడు. ఆ భక్తుడు నాకు కాళ్ళు వద్దు, చేతులే ఇమ్మంటాడు. ఇదేమిటి కాళ్ళు ఇస్తే సుఖం కదా, నడవటానికి బాగుంటాయి, అటూ ఇటూ నడుస్తూ ఉండవచ్చు, నువ్వు కాళ్ళు వద్దు చేతులు ఇమ్మంటున్నావు ఏమిటి అన్నాడు దేవుడు. నువ్వు నాకు చేతులు ఇస్తే, నీ పాదాలకి పూజ చేసుకోవటానికి బాగుంటుంది అందుకు చేతులు ఇమ్మంటున్నాను అంటాడు ఆ భక్తుడు. నాకు సంబంధించినంత వరకూ కాళ్ళు ముఖ్యం కాదు, నీ పాదాలకి అర్చన చేసుకోవటానికి చేతులే ముఖ్యం అంటాడు. అంటే ఆ భక్తుడికి భగవంతుడి తోటి అనుసంధానం కావాలి. నీ తోటి నాకు అనుబంధం కావాలి అంటాడు. అది భక్తుడి లక్షణం.

భగవంతుడు ఇచ్చినటువంటి అవకాశాలని జాగ్రత్తగా ఉపయోగించుకోవాలి. చదువు ఉంటే మంచికి ఉపయోగించు, డబ్బు ఉంటే మంచికి ఉపయోగించు. కొంతమందికి చదువు లేకపోయినా, డబ్బు లేకపోయినా, తెలివి ఉంటుంది. ఆ తెలివిని కూడా మంచి పనులు చేయటానికి ఉపయోగించు. సమాజాన్ని సమాధాన పరచటానికి నీ తెలివిని ఉపయోగించు. దేహం, మనస్సు, వాక్కు, ఇవి ఉపకరణాలు. దేహం తోటి చేసే తపస్సు, వాక్కుతోటి చేసే తపస్సు, మనస్సుతోటి చేసే తపస్సు ఇవన్నీ గురువు అనుగ్రహం పొందటానికి ఉపయోగపడతాయి.

మీకు ఈశ్వరుడి మీద విశ్వాసం ఉన్నప్పుడు, ఈశ్వరుడి దయ మీద, ప్రేమ మీద, ఈశ్వరుడికి ఉన్న శక్తి మీద , గురువు యొక్క శక్తి మీద, మీకు నమ్మకం ఉన్నమాట నిజమైతే మీకు అశాంతి ఉండదు, ఆందోళన ఉండదు.

లౌకికులకి చావులు పుట్టుకలు ఉంటాయి కాని, భక్తులకి చావు లేదు పుట్టుక లేదు అన్నాడు తుకారం. ఎక్కడో జ్ఞాని దాకా, ఆత్మజ్ఞానం దాకా అటు ఉంచండి. భక్తుడనే వాడికి చావు పుట్టుక లేదు. మనిషి చచ్చిపోతాడు కాని భక్తి ఏమీ చావదు. శరీరం పుడుతుంది కాని భక్తి పుట్టేది కాదు. భక్తికి పుట్టుక లేదు చావు లేదు. అది ఎప్పుడూ నీ హృదయంలో ఉండేదే. మీకూడా వచ్చేస్తుంది భక్తి.

**సేకరణ: సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి**

## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**సంవత్సర చందా రు॥ 150/-లు.**

**శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు.**

రమణ భాస్కర చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము. మీ చందాను స్వయంగా గానీ లేక **శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి** అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

దిII **21-07-2024** ఆదివారం **గురుపూర్ణిమ మహోత్సవం**

సందర్భంగా **శ్రీ రమణక్షేత్రం, జిన్నూరు**లో జరుగు కార్యక్రమములు

ఉదయం గంII 6-00లకు - **పారాయణం**

గంII 6-45 నిIIలకు - **శేష మరియు నెమలి వాహనములపై గిరి ప్రదక్షిణ**

గంII 7-00ల నుండి - **అల్పాహారం**

గంII 7-30 నిIIలకు - **పూజా కార్యక్రమాలు**

గంII 9-00ల నుండి గంII 11-00ల వరకు **సత్సంగం**

గంII 11-00ల నుండి - **అన్న ప్రసాదం**

**భక్తులందరికీ ఆహ్వానము**




సద్గురు శ్రీ నాన్నగారి దివ్య సన్నిధి

# వ్యాసం వందే జగద్గురుం

మన సనాతన సంప్రదాయంలో 'జ్ఞాననిధి' భగవాన్ శ్రీ వ్యాసమహర్షి జన్మదినమైన ఆషాఢ పూర్ణిమను గురుపూర్ణిమగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది. ఆ రోజున గురుపూజ చేయడంలోని ఆంతర్యం తమ గురువును వేదవ్యాసుని స్వరూపంగా పూజించడమే. ఏ మంచి పని చేయాలన్నా ముందుగా గురుప్రార్థన, గురుధ్యానం చేయడం అన్నది మన సంప్రదాయం. గు అంటే చీకటి, రు అంటే వెలుతురు. చీకటి అజ్ఞానానికి గుర్తు, వెలుతురు జ్ఞానానికి గుర్తు. కనుక చీకటి వంటి అజ్ఞానాన్ని పోగొట్టి, ఎవరైతే జ్ఞాన జ్యోతిని వెలిగిస్తారో వారే సద్గురువులు. గురువంటే వ్యవహారిక సత్యం కాదు, గురువంటే పారమార్థిక సత్యం. గురువు, పరమాత్మ, దేవుడూ అన్నీ పర్యాయపదములే, మూడు ఒకే చైతన్యం. గురువుపట్ల కృతజ్ఞత చూపడానికే గురుపూర్ణిమ ఏర్పడింది. భారతీయ సంస్కృతికి వాల్మీకి, వ్యాసుడు మూలపురుషులు. వ్యాసుడు విజ్ఞానఖని, వేదాలని నాలుగుగా విభజించి వేదవ్యాసుడయ్యాడు. బ్రహ్మసూత్రాలను క్రోఢీకరించారు. అష్టాదశ పురాణాలు, మహాభారతము, భాగవతములను ఘనమైన వారసత్వ సంపదలుగా మనకు అందించారు. సమస్త ఉపనిషత్ సారము, నాలుగు యోగాల సమన్వితము, పరమాత్మ బోధితమైన భగవద్గీతను అనుగ్రహించారు. గురువు ద్వారానే గోవిందుని దర్శనం అవుతుంది. గురువంటే మానవ శరీరం ధరించిన దేవుడు. దేహాత్మబుద్ధి నశించి, ఆత్మబుద్ధి కలగడానికి గురువు ఎన్ని ప్రయత్నాలు చేయాలో అన్నీ చేస్తూనే ఉంటారు. నూటికి నూరు పాళ్ళు స్వరూపశాంతిని పొందేవరకు జన్మజన్మలు వెంటాడుతూనే ఉంటారు. గురువు కాలాతీతుడు కాని వ్యవహారం కోసం కాలానికి కట్టుబడి ఉంటారు. జనన మరణ ప్రవాహంలో చిక్కుకొని దుఃఖము, అశాంతితో అలమటిస్తున్న జీవకోటికి ఎప్పుడో, ఎక్కడో దూరంగా ఉంది అనుకునే గమ్యాన్ని దగ్గరకు తెచ్చి 'అది నీవే' అని ఎరుకపరుస్తారు సద్గురువు. మనకు శాస్త్ర జ్ఞానం లేకపోవచ్చు కానీ సకలశాస్త్రసారం మరియు జ్ఞానసారం గురువే అన్న జ్ఞానం ఉంటే గురువాక్యం వేదవాక్యం అవుతుంది. సత్యాన్వేషణ చేయాలి, వాస్తవంగా నేను ఎవరో తెలుసుకోవాలి అన్న సంకల్పమే గుర్వనుగ్రహానికి గుర్తు. మన సాధనలు శ్రవణ, మనన, నిధి ధ్యాసల కన్నా ఎక్కువగా గుర్వనుగ్రహం వల్లనే ఆత్మసిద్ధి కలుగుతుందని సద్గురు ఉవాచ. గురువులకు గురువైన శ్రీవేదవ్యాసుడు భారతీయ ఆధ్యాత్మికతకు చేసిన సేవ నిరుపమానం. సద్గురువు శ్రీ నాన్నగారి సమక్షంలో అనేక గురుపూర్ణిమలు జరుపుకోవడం ఎన్నో జన్మల పుణ్యఫలం. గురువుకు ఒకే ఒక కోరిక ఉంటుంది అది తాను పొందిన అమృతస్థితిని అందరూ పొందాలని.

**(దిll 21-07-2024 గురుపూర్ణిమ సందర్భంగా)**

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**